బిజెపి నాయకులకు షోకాజ్ నోటీసులు

గజ్వేల్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:

పార్టీ నియమ నిబంధనలు ఉల్లంఘించిన మాజీ బిజెపి మండల అధ్యక్షుడు బండారు మహేష్‌కుమార్, బిజెపి సీనియర్ నాయకుడు జాలిగామ సురేష్‌లకు బిజెపి జిల్లా అధ్యక్షులు బైరి శంకర్ షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు బిజెపి పట్టణ అధ్యక్షుడు మనోహర్ యాదవ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మనోహర్ యాదవ్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బిజెపికి వ్యతిరేకంగా ప్రచారం చేసి పార్టీ క్రమశిక్షణ రాహిత్యానికి పాల్పడినట్లు రుజువు కావడంతో బిజెపి జిల్లా అధ్యక్షులు బైరి శంకర్ షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. షోకాజ్ నోటీసులు అందుకున్న వారు మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని, లేనిచో పార్టీ పరంగా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సంక్షేమం

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:

కాంగ్రెస్ పార్టీ అంటేనే అభివృద్ధి, సంక్షేమం అని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. మండల పరిధి ఖాజాపూర్ సర్పంచి మన్నె బాలస్వామి, ఖాజాపూర్ తండా సర్పంచి ప్రియా నాయక్, వార్డు సభ్యులు భాగ్యనగరంలో మైనంపల్లి హనుమంతరావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి అందరూ కాంగ్రెస్‌బాట పడుతున్నారని అన్నారు. ఖాజాపూర్, ఖాజాపూర్ తండాల నుండి సుమారు 100 మందికి పైగా సభ్యులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు సాన సత్యనారాయణ, మోహన్ నాయక్, రాజిరెడ్డి, అక్బర్, పోచయ్య, ప్రభాకర్, బిక్షపతి, సిద్దాగౌడ్, రాజశేఖర్, యాదగిరి, నర్సింలు, పోచయ్య, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

వార్త ప్రభావం

పిహెచ్‌సిలో వైద్యసేవల మాయాజాలం వార్తకు స్పందించిన మంత్రి పొన్నం

-రోగులకు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని జిల్లా వైద్యాధికారులకు ఆదేశాలు

మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్ (ఫైల్‌ఫోటో)

హుస్నాబాద్ రూరల్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:

అక్కన్నపేట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యసేవల లోపాలపై శనివారం ప్రభాతవార్తలో పిహెచ్‌సిలో వైద్యసేవల మాయాజాలం అనే శీర్షికతో ప్రచురితమైన వార్తా కథనానికి హుస్నాబాద్ శాసనసభ్యులు, రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమశాఖామంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించారు. వార్తను గమనించిన మంత్రి శనివారం మధ్యాహ్నం జిల్లా వైద్యాధికారులతో ఫోన్‌లో మాట్లాడి, అక్కన్నపేట పిహెచ్‌సిలో రోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. మారుమూల ప్రాంతమైన అక్కన్నపేటలో గిరిజన జనాభా అధికంగా ఉండటాన్ని దృష్టిలో పెట్టుకుని, వైద్య సేవల్లో నిర్లక్ష్యంగా ఉండకూడదని, అవసరమైతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లుచేసి అయినా సరే డాక్టర్ అందుబాటులో ఉండేలాచూడాలని మంత్రి అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. ఈనేపథ్యంలో జిల్లా వైద్యాధికారులు పరిస్థితిని సమీక్షించి, అక్కన్నపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సేవలు సక్రమంగా కొనసాగేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సమాచారం. వార్త ప్రభావంతో మంత్రిస్థాయిలో స్పందన రావడంపై మండల ప్రజలు సంతృప్తి వ్యక్తంచేస్తూ, మంత్రి ఆదేశాలను అధికారులు మాటలకే పరిమితం చేయకుండా శాశ్వత వైద్యుని నియామకం జరిగితేనే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని వారు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు.

మంత్రి, ఎంపిలను కలిసిన మున్సిపల్ చైర్మన్

మంత్రి దామోదర్ రాజనర్సింహను కలిసిన మున్సిపల్‌చైర్మన్ ఎండి యూనిస్, కౌన్సిలర్లు

జహీరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సి.దామోదర్ రాజనర్సింహ, జహీరాబాద్ ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్, టీమ్రీస్ చైర్మన్ ఫహీం ఖురేషి, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ నందారం గిరిధర్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సిద్దం ఉజ్వల్‌రెడ్డిలను హైద్రాబాద్‌లో శనివారం మున్సిపల్ చైర్మన్ ఎండి యునూస్, కౌన్సిలర్లు మర్యాదపూర్వకంగా కలుసుకుని పూలబొకేలను అందించి శాలువాలతో సత్కరించారు. జహీరాబాద్ పట్టణ అభివృద్ధికి కృషి చేయాలని మంత్రి, ఎంపి, చైర్మన్, నాయకులు చైర్మన్, కౌన్సిలర్లకు సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రంగా అరుణ్‌కుమార్, నాయకులు పట్లోళ్ల శ్రీకాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కలెక్టర్‌ను కలిసిన నూతన మున్సిపల్ చైర్మన్

జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను కలిసిన నర్సాపూర్ మాచునూరి లక్ష్మీరాజుయాదవ్ తదితరులు

నర్సాపూర్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:

నర్సాపూర్ నూతన మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికైన మాచునూరి లక్ష్మీరాజుయాదవ్ శనివారం మెదక్ కలెక్టర్ కార్యాలయంలోజిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికైన లక్ష్మీరాజుయాదవ్‌ను కలెక్టర్ శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట కౌన్సిలర్లు సుధీర్‌గౌడ్, ఇలియాస్, రవి, ఆఫ్రిన్ తదితరులు ఉన్నారు.

నర్సాపూర్ అడవిలో దారిదోపిడీ

-ఓ వ్యక్తి నుంచి రూ.10వేల నగదు అపహరణ

నర్సాపూర్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:

నర్సాపూర్ అటవీ ప్రాంతంలోని నత్నాయపల్లి శివారులో ఆటో ఎక్కిన వ్యక్తిపై దారిదోపిడీ జరగగా ఆ వ్యక్తి నుంచి రూ.13వేల విలువైన వస్తువులు దొంగిలించిన సంఘటన శుక్రవారం చోటు చేసకుంది. ఈ సంఘటన వివరాలు ఎస్సై రంజిత్‌కుమార్‌రెడ్డి కథనం ప్రకారం.. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం నల్లవల్లి గ్రామానికి చెందిన చెన్నపురం రవి అనే వ్యక్తి నర్సాపూర్‌లో శుక్రవారం జరిగే సంతకు వచ్చాడు. నర్సాపూర్‌లో జరిగే సంతలో అతను కూరగాయలు తదితర వస్తువులు తీసుకొని నల్లవల్లికి తిరుగు ప్రయాణం అయ్యాడు. ఈ క్రమంలో నర్సాపూర్ మెయిన్ రోడ్డుపైగల గోల్డెన్ చికెన్ షాప్ వద్ద నిలుచున్నాడు. అంతలోనే ఒక ఆటో రాగానే ఇంటికి వెళ్దామని ఆటోలో ఎక్కాడని తెలిపారు. ఈ ఆటోలో మరో ముగ్గురువ్యక్తులు ఉండగా ఆటోలో వెళ్తున్న క్రమంలో నర్సాపూర్ ఆడవి ప్రాంతంలోగల నత్తనాయపల్లి శివారులోకి రాగానే ఆటో డ్రైవర్ నత్నాయపల్లి గ్రామానికి వెళ్లే మట్టి రోడ్డు గుండా తీసుకెళ్లాడని తెలిపారు. ఈ క్రమంలో ఆటోలో ఉన్న ముగ్గురువ్యక్తులు రవిని కాళ్లతో తన్ని, చేతులతో దాడిచేసి తన వద్దనున్న పదివేల రూపాయల నగదును, ఒక సెల్‌ఫోను లాక్కొని వెళ్లిపోయారని తెలిపారు. ఈ సమాచారం తెలుసుకున్న రవి కుటుంబసభ్యులు వచ్చి అతనిని ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్సలు చేసిన అనంతరం నర్సాపూర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదుచేశారు. బాధితుడు చెన్నాపురం రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రంజిత్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

మురళీధర్‌రావును కలిసిన బిజెపి కౌన్సిలర్లు

నర్సాపూర్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:

నర్సాపూర్ నియోజకవర్గానికి వచ్చిన బిజెపి మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మధ్యప్రదేశ్ ఇన్చార్జి మురళీధర్‌రావును శనివారం నర్సాపూర్ మున్సిపాలిటీ నుంచి బిజెపి పార్టీ తరపున నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లు మున్సిపల్ వైస్ చైర్మన్ బుచ్చేష్‌యాదవ్, కౌన్సిలర్లు నిరంజన్ దాస్, శ్రీకాంత్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మురళీధర్‌రావు బిజెపి పార్టీ నుంచి నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లను అభినందించారు.

గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలి

-సర్పంచులతో జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య, జడ్పిసిఓ జానకిరెడ్డి

సంగారెడ్డి మున్సిపాలిటీ, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:

పల్లెల సర్వతోముఖాభివృద్ధే ప్రధాన లక్ష్యంగా సర్పంచులు అంకిత భావంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య పిలుపునిచ్చారు. నూతనంగా ఎన్నికైన సర్పంచుల కోసం జిల్లా కేంద్రంలోని మహిళా ప్రాంగణంలో నిర్వహించిన ఐదు రోజుల శిక్షణా కార్యక్రమం ముగింపు సందర్భంగా శనివారం ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని సర్పంచులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, శిక్షణలో పొందిన అవగాహనను గ్రామాల అభివృద్ధికి సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రజలకు సమర్థవంతమైన, పారదర్శక పాలన అందించడం సర్పంచుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. నిధులు, విధులను సక్రమంగా వినియోగిస్తూ, అన్ని వర్గాల సమన్వయంతో గ్రామాల సమగ్రాభివృద్ధి సాధించాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు ప్రజల అవసరాలను గుర్తించి స్పందించాలని సూచించారు. తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజలతో మమేకమై బాధ్యతాయుతంగా వ్యవహరించాలని హితవు పలికారు. గ్రామ పంచాయతీలను ఆదర్శవంతమైన స్థానిక సంస్థలుగా తీర్చిదిద్దేందుకు సర్పంచులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని, పారదర్శకత, బాధ్యతాయుత వైఖరి పాటించాలని కలెక్టర్ పి. ప్రావీణ్య సూచించారు.

ఈ కార్యక్రమంలో కలెక్టర్ పి.ప్రావీణ్యతోపాటుగా జడ్పి సిఈవో, ఇన్‌చార్జ్ జిల్లా పంచాయతీ అధికారి జానకిరెడ్డి, డిఎల్పీవోలు, ఎంపిడివోలు, మాస్టర్ ట్రైనర్లు, ఆయా గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల ఆకస్మిక తనిఖీ

-మధ్యాహ్నభోజనాన్ని పరిశీలించిన కలెక్టర్ హైమావతి

దుబ్బాక, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:

దుబ్బాక మండల పరిధిలోని రామక్కాపేట గ్రామంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ కె.హైమావతి ఆకస్మికంగా సందర్శించారు. మధ్యాహ్నభోజన ప్రక్రియను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. వంటలలో నిర్లక్ష్యాన్ని గమనించి ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వం నుండి సరుకులు, కూర గాయలు, అన్నీ అందిస్తుంటే పిల్లలకు మెనూ ప్రకారం నాణ్యమైన కూరలతో కాకుండా భోజనం ఇలా పెడతారా అని కేర్‌టేకర్, ఉపాధ్యాయులపైన మండిపడ్డారు. 500కి పైగా విద్యార్థులకు సరిపడా వండకుండా, చేసిన కూరలు సైతం 237మంది విద్యార్థులకు కూడా సరిపోకపోగా, 132 మంది విద్యార్థులకు గుడ్లు ఎందుకు తక్కువ వండారని వంట సిబ్బందిని ఆరాతీశారు. సగంమంది విద్యార్థులకు కూరలు సరిపోలేదని, దగ్గరుండి మళ్లీ వండించారు. వంటల్లో పలు సూచనలు చేశారు. కూర వండించి మిగిలిన విద్యార్థులకు పెట్టించారు. స్టాక్ రిజిస్టర్ వెరిఫై చేస్తూ రాసిన సరుకులకు, చేసిన వంటకి అస్సలు పొంతనేలేదని అసహనం వ్యక్తంచేశారు. కామన్ డైట్ మెనూ పాటిస్తూ రోజూ విద్యార్థుల హాజరుప్రకారం ఆహారపదార్థాలు అందించాలని, లైబ్రేరియన్, ప్రతి వంటకం విద్యార్థులకు అందరికీ సరిపోవాలని, కడుపునిండా తినేవిధంగా రుచికరంగా వండాలని వంట సిబ్బందిని ఆదేశించారు. ఇంత అధ్వాన్నంగా భోజనం పెడుతున్నందుకు గాను కేర్‌టేకర్, ఇతర అధికారులపైన కఠినచర్యలు తీసుకోవాలని జోనల్ అధికారికి ఫోన్‌ద్వారా ఆదేశించారు. విద్యార్థులకు భోజనం, వసతి, చదువు విషయంలో రాజీ పడవద్దని ప్రభుత్వం అందజేస్తున్న ఫలాలను విద్యార్థులకు చేరవేయడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేదిలేదని విధులు సక్రమంగా నిర్వహించాలని కలెక్టర్ హైమావతి ఆదేశించారు.

వంట గదిని తనిఖీ చేస్తున్న కలెక్టర్ హైమావతి

పాఠశాలను ఆకస్మికంగా తనిఖీచేసిన కలెక్టర్

-పరీక్షలు జరుగుతున్న విధానాన్ని పరిశీలించిన కలెక్టర్ రాహుల్‌రాజ్

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని ఇష్టపడి చదవాలని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. శనివారం మండల పరిధి సూరారం జడ్పి పాఠశాలను ఆకస్మికంగా తనిఖీచేశారు. ప్రీఫైనల్ పరీక్షలు జరుగుతున్న విధానాన్ని పరిశీలించారు. విద్యార్థులకు ప్రశ్నలువేసి, సమాధానాలను అడిగారు. విద్యార్థులచే బోర్డుపై సమాధానాలను రాయించారు. పరీక్షలను ఎలా ఎదుర్కోవాలో పలుసూచనలు చేశారు. విద్యార్థులు పరీక్షలలో మానసిక ఒత్తిడికి గురి కావద్దని, ప్రణాళికాబద్ధంగా చదివి పరీక్షలను రాయాలని తెలిపారు. విద్యపైనే దృష్టి కేంద్రీకరించాలని పేర్కొన్నారు. పదిలో 100శాతం ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సాయిరెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

గర్భవిచ్ఛిత్తి మాత్రల అక్రమవ్యాపారం..!?

-మెడికల్ షాపులకే కాదు, ఆర్ఎంపిలు, ప్రైవేట్ ల్యాబ్‌లకూ విస్తరణ
-మహిళల ప్రాణాలతో చెలగాటం.. వేలల్లో దోపిడీ
-డ్రగ్ ఇన్‌స్పెక్టర్ వ్యవస్థ ఘోరవైఫల్యం

గర్భవిచ్ఛిన్న మాత్రల సేకరణ దృశ్యం

హుస్నాబాద్ రూరల్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:

గర్భవిచ్ఛిన్నానికి ఉపయోగించే మాత్రల అక్రమ విక్రయాలు తీవ్రకలకలం రేపుతున్నాయి. వైద్యులచిట్టీ తప్పనిసరిగా ఉండాల్సిన ఈ మందులను, నిబంధనలను పూర్తిగా పక్కన పెట్టి కొన్ని మెడికల్‌షాపులు యథేచ్ఛగా విక్రయిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇక పాకింగ్ విషయం ఏమిటంటే, డాక్టర్‌ల ప్రిస్క్రిప్షన్ లేకుండా గర్భవిచ్ఛిన్న మాత్రలు కావాలని వారి వద్దకు వచ్చే వారి అవసరాలను ఆసరాగా చేసుకుంటున్న అక్రమార్కులు మార్కెట్‌లో సుమారు రూ.300లనుండి రూ. 350 రూపాయలకే లభించే ఈమాత్రలకు రూ.3వేలనుంచి 3,500 రూపాయల వరకు వసూలు చేస్తున్నట్లు బాధితులు చెబుతున్నారు. మహిళల అత్యవసర పరిస్థితులను ఆసరాగా చేసుకుంటున్న అక్రమార్కులు, భారీగా లాభాలు గడిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. హుస్నాబాద్‌లోని కొన్ని మెడికల్‌షాపులతోపాటు ఆర్ఎంపిలు (రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్లు), అలాగే కొన్ని ప్రైవేట్ ల్యాబ్‌లలో కూడా ఈ గర్భవిచ్ఛిన్న మాత్రల విక్రయాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. రక్తపరీక్షల పేరుతో ల్యాబ్‌లకు వచ్చిన మహిళలకు, వెనుకదారిలో ఈమాత్రలు అందిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఇది పూర్తిగా చట్టవిరుద్ధమని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. అక్రమాలపై నిఘా వహించాల్సిన డ్రగ్ ఇన్‌స్పెక్టర్ వ్యవస్థ ఈప్రాంతంలో పూర్తిగా విఫలమైందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నెలల తరబడి తనిఖీలు లేకపోవడం, అకస్మికదాడులు జరగకపోవడమే ఈ అక్రమవ్యాపారం పెరగడానికి కారణమని ప్రజలు అంటున్నారు. వైద్యులపర్యవేక్షణ లేకుండా గర్భవిచ్ఛిన్న మాత్రల వినియోగం వల్ల తీవ్ర ఆరోగ్యసమస్యలు, ప్రాణాపాయ పరిస్థితులు తలెత్తే అవకాశం ఉందని వైద్యవర్గాలు హెచ్చరిస్తున్నాయి. అయినా కూడా లాభాల కోసమే కొందరు ఈ అక్రమాలకు పాల్పడుతున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈవ్యవహారంపై తక్షణమే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, డ్రగ్ కంట్రోల్ విభాగం స్పందించి మెడికల్‌షాపులు, ఆర్ఎంపిలు, ప్రైవేట్‌ల్యాబ్‌లపై సమగ్రదర్యాప్తు చేపట్టాలని స్థానిక మహిళాసంఘాలు, ప్రజాసంఘాలు డిమాండ్‌చేస్తూ, ఈతప్పిదాలకు పాల్పడినవారిపై కఠినచర్యలు తీసుకోవాలని వారు డిమాండ్‌చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించకపోతే, హుస్నాబాద్‌లో ఈ అక్రమవ్యాపారం మరింత విస్తరించే ప్రమాదముందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

డ్రగ్ ఇన్‌స్పెక్టర్ వ్యవస్థ ఘోరవైఫల్యం!?

ఇలాంటి అక్రమాలపై నిఘా వహించాల్సిన డ్రగ్ ఇన్‌స్పెక్టర్ వ్యవస్థ హుస్నాబాద్ నియోజకవర్గవ్యాప్తంగా పూర్తిగా విఫలమైందన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి. నెలల తరబడి తనిఖీలు లేకపోవడం, ఆకస్మిక దాడులు జరగకపోవడమే ఈ అక్రమవ్యాపారం పెరగడానికి కారణమని ప్రజలు అంటున్నారు. అధికారులనిర్లక్ష్యం వల్లే అక్రమార్కులకు తెగింపు పెరిగిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కఠినచర్యలు తీసుకోవాలంటున్న మహిళాసంఘాలు...

దీనిపై తక్షణమే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, డ్రగ్ కంట్రోల్‌విభాగం స్పందించి హుస్నాబాద్‌లోని మెడికల్‌షాపులు, ఆర్ఎంపిలు, ప్రైవేట్‌ల్యాబ్‌లపై సమగ్రదర్యాప్తు చేపట్టాలని స్థానిక మహిళాసంఘాలు, ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించకపోతే హుస్నాబాద్‌లో ఈగర్భవిచ్ఛిన్నమాత్రల అక్రమవ్యాపారం మరింత విస్తరించే ప్రమాదం ఉందని, దీని ప్రభావం నేరుగా మహిళల ప్రాణాలపై పడుతుందని ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తల్లీకూతుళ్ల అదృశ్యం

జహీరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:

తల్లీకూతుళ్లు అదృశ్యమైన సంఘటన పట్టణంలోని గాంధీనగర్‌లో చోటుచేసుకుంది. ఎస్ఐ కె.వినయ్‌కుమార్ కథనం ప్రకారం.. గాంధీనగర్‌కు చెందిన బేడ బుడగజంగం శాంతమ్మ తన మూడేళ్ల చిన్నకుమార్తె అంబికతో కలిసి ఇంట్లో ఎవరికీ చెప్పాపెట్టకుండా ఈనెల 15న తారీఖున ఇంట్లోనుంచి వెళ్లిపోయిందన్నారు. బంధువులు, సన్నిహితుల వద్ద తల్లీకూతుళ్ల ఆచూకీ కోసం గాలించినా ప్రయోజనం లేకపోవడంతో శాంతమ్మభర్త ఎల్లప్ప ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వినయ్‌కుమార్ వివరించారు.

వివాహిత అదృశ్యం

జహీరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:

వివాహిత యువత అదృశ్యమైన సంఘటన పట్టణంలోని కాంతరెడ్డినగర్ కాలనీలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. పట్టణ ఎస్ఐ కె.వినయ్‌కుమార్ కథనం ప్రకారం.. కాంతరెడ్డి కాలనీకిచెందిన మొహమ్మద్ ముస్తాఫా, ఆసియాలు భార్యాభర్తలు, నిత్యంమాదిరిగానే శుక్రవారంరాత్రి ఇద్దరూ నిద్రకు ఉపక్రమించారు. రాత్రి 12గంటల ప్రాంతంలో భర్తకు మెలుకువరాగా భార్య ఆసియా కనపడలేదు. ఆసియా ఆచూకీ కోసం బంధువులు, సన్నిహితుల వద్ద గాలించినా ప్రయోజనం లేకపోవడంతో శనివారం మొహమ్మద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వినయ్‌కుమార్ వివరించారు.

యువకుడిని ఎర్రగడ్డ ఆసుపత్రిలో చేర్చిన ఎస్ఐ

సిర్గాపూర్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:

మతిస్థిమితంకోల్పోయిన యువకుడు రోడ్డుపై వెళుతున్న వ్యక్తులను కట్టెలతో, రాళ్లతో కొడుతూ, తిడుతుండటంతో ప్రజల ఫిర్యాదుమేరకు ఎస్ఐ మహేష్ యువకుడిని కుటుంబసభ్యుల సూచనలమేరకు హైద్రాబాద్ ఎర్రగడ్డలోని ఆసుపత్రిలో చేర్పించారు. యువకుడిని ఎర్రగడ్డ ఆసుపత్రిలో చేర్పించడం పట్ల గ్రామస్థులు ఎస్సైని అభినందించారు.

ఎల్లుపేటలో విద్యుత్‌తీగెలు తగిలి గడ్డిలారీ దగ్ధం

ఇద్దరికి స్వల్ప గాయాలు.. 2లక్షలు నష్టం

ఎల్లుపేటలో విద్యుత్‌తీగెలు తగిలి నిప్పంటుకున్న లారీ దృశ్యం

టేక్మాల్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:

మండలంలోని ఎల్లుపేట ప్రధాన రహదారిపై శనివారం గడ్డిలారీకి విద్యుత్ తీగెలు తగిలి ప్రమాదం చోటుచేసుకుంది. మెదక్ జిల్లా కొల్చారం గ్రామానికి చెందిన (ఎడిటి) 9192గల లారీ పశువుల మేత కోసం టేక్మాల్ మండల పరిధిలోని ఎల్లుపేటగ్రామశివారులో పశువులమేతకు 350మోపులు నింపుకొని ప్రధానరోడ్డుకు వెళ్తున్న సమయంలో ఎల్లుపేట రహదారివద్ద లారీకి ప్రమాదవశాత్తు విద్యుత్‌తీగె తగలడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఇది గమనించిన స్థానికులు వెంటనే స్పందించి, క్రేన్ల సహాయంతో గడ్డిని లారీ నుంచి బయటకు తోసివేసి పెను ప్రమాదాన్ని తప్పించారు. మంటలు భారీగా చెలరేగడంతో సుమారు కిలోమీటర్లు మేర గడ్డి మోపులు రోడ్డుకు ఇరువైపులా పడేయడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. సుమారు రెండు లక్షల రూపాయలు ఆస్తినష్టం జరిగినట్లు లారీ డ్రైవర్ నాగరాజు తెలిపారు. నల్లకుంట తాండకు చెందిన సేవాలాల్ యూత్ సభ్యులు జెసిబి సహాయంతో మంటలు అదుపులోకి తీసుకొని అర్పివేశారు. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలు కావడంతో వారిని చికిత్సనిమిత్తం పాపన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మంజీరలో దూకి ఆర్టీసి డ్రైవర్ ఆత్మహత్య

మంజీరలో దూకి ఆత్మహత్య చేసుకున్న ఆర్టీసి డ్రైవర్

న్యాల్‌కల్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:

మండలపరిధిలోని చాల్కిగ్రామశివారులో ప్రవహిస్తున్న మంజీరానదిలో దూకి ఆర్టీసి డ్రైవర్ పాపయ్య ఆత్మహత్యచేసుకున్న సంఘటనకు సంబంధించి ఎస్ఐ దోమ సుజిత్ కథనం ప్రకారం పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. ఝరాసంగం మండలం కుప్పానగర్‌కుచెందిన పాపయ్య(43) నారాయణఖేడ్ ఆర్టీసి డిపోలో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడన్నారు. కుటుంబ కలహాలతో మనోవేదనకు గురైన పాపయ్య శుక్రవారంసాయంత్రం మోటారుసైకిల్‌పై మంజీరానది వంతెన వద్దకు వచ్చి బట్టలు, చెప్పులు, బైకు అక్కడ పెట్టేసి కుమార్తెతో వీడియో కాల్‌లో మాట్లాడుతూ తను ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పి నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. మృతుడి కుమార్తె స్వాతి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ దోమ సుజిత్ వివరించారు.

అతివేగానికి ఓ జీవితం బలి

-నర్సాపూర్ ఫారెస్ట్‌లో ఘోర రోడ్డు ప్రమాదం
-22 ఏళ్ల యువకుడు మృతి

గుమ్మడిదల, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:

హైదరాబాద్ కెపిహెచ్‌బినుండి నర్సాపూర్‌వైపు వీకెండ్‌రైడింగ్‌కు బయలుదేరిన వేణు మార్విన్‌లింకన్ (22) అనేయువకుడు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. నర్సాపూర్‌ఫారెస్ట్ పరిధిలోని ప్రమాదకర టర్నింగ్ వద్ద అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న ఐరన్ ఫెన్సింగ్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పజెప్పడం జరిగిందని తెలిపారు. గుమ్మడిదల ఎస్సై లక్ష్మీకాంత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మృతుడు స్వస్థలం గుంటూరు జిల్లా కాగా, ప్రస్తుతం హైదరాబాద్ సైబర్ టవర్స్ పరిధిలోని జీస్టా టెక్నాలజీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నట్లు తెలిసింది. ఈ ఆకస్మికమృతి కుటుంబ సభ్యులను, స్నేహితులను తీవ్రవిష

సమస్యలు పరిష్కరించాలని కోరిన కాలనీ వాసులు

మా కాలనీల సమస్యలు పరిష్కరించాలని మాజీ డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డిని కోరుతున్న ప్రజల దృశ్యం.

నార్సింగి, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త : రాజేంద్రనగర్ సర్కిల్ హైదర్షాకోట్ డివిజన్ పరిధిలో ఉన్న కేకే-2, రంగారెడ్డి కాలనీ, గణేష్ నగర్ కాలనీలకు చెందిన ప్రజలు సమస్యలు పరిష్కరించాలని శనివారం మాజీ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కారమయ్యేలా చూస్తామని తెలిపారు. ఎన్నికలు ఉన్నా లేకున్నా, అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజల మధ్యనే ఉండాలని ఎమ్మెల్యే మమ్ములను ఆదేశించారని, నిత్యం మేము ప్రజల మధ్యనే ఉంటున్నామని తెలిపారు. పిలిస్తే పలికే నాయకుడు ఎమ్మెల్యేగా ఉండడం ఈ ప్రాంత ప్రజల అదృష్టమని, అర్ధరాత్రి వెళ్లి మా ఇబ్బందులు తొలగించాలని కోరినా స్పందిస్తారని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పట్ల వేగంగా స్పందించే గుణమే ప్రకాశ్‌గౌడ్‌ను వరుసగా నాలుగుమార్లు ఎమ్మెల్యేగా గెలిపించిందన్నారు. ఆరేళ్లుగా ఎమ్మెల్యే అండతోనే ప్రజల సమస్యలు వేగంగా పరిష్కరించామని, కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి పనులు చేశామని రాజేందర్‌రెడ్డి వివరించారు.

విద్య,ఉద్యోగ,రాజకీయ రంగాల్లో రాణించాలి

అరుంధతీ సేవామండలి అదనపు అంతస్తు భవనాన్ని ప్రారంభించిన దృశ్యం

గోషామహల్,ఫిబ్రవరి 21ప్రభాతవార్త: సమాజంలో మాదిగలు గుర్తింపు పొందాలంటే విద్య,ఉద్యోగ,రాజకీయ రంగాలల్లో రాణించాల్సిన అవసరం భాద్యత ఎంతైనా ఉందని మాజీ కార్పొరేటర్లు జి.శంకర్‌యాదవ్,బొయిని దర్శన్,సంఘ సేవకులు ఎంపి భీష్మాలు పేర్కొన్నారు.చుడీబజార్‌లోని అరుంధతీ సేవా మండలి భవనంపై అదనపు అంతస్తుపై నిర్మాణం చేపట్టిన నూతన భవానాన్ని వారు కలిసి సంఘం అధ్యక్షులు మిద్దే కృష్ణ, ప్రారంభించారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ దాదాపు 60 నుంచి 70 ఏళ్లచరిత్ర కలిగిన అరుంధతి భవనంపై అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం పట్ల వారు అరుంధతి ప్రతినిధులను అభినందించారు.ఈకార్యక్రమంలో ఉపాధ్యక్షులు డి. వెంకటేష్,చంద్రమోహన్,సభ్యులు తిరుమల్లేష్, డాన్‌సూరి, బాల స్వామి తదితరులు పాల్గొన్నారు.

అఫ్జల్‌గంజ్ ఇన్‌స్పెక్టర్‌గా మోహన్‌కుమార్...

అఫ్జల్‌గంజ్,ఫిబ్రవరి 21ప్రభాతవార్త: శాంతి భద్రతలను కాపాడేందుగాను పోలీసులకు ప్రజలు సహకరించాలని అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా మోహన్‌కుమార్ పదవి భాద్యతలు స్వీకరించారు.ఇక్కడ విధులను నిర్వహించిన రవి సి.సి.ఎస్‌కు బదిలీ వెళ్లారు.ఆయన స్థానంలో మోహన్‌కుమార్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా మోహన్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.శాంతిభద్రతలను కాపాడే పోలీసులకు ప్రజలు కూడా సహకరించాలని కోరారు.మహాత్మాగాంధీ బస్‌స్టేషన్, ఉస్మానియా ఆసుపత్రి వ్యాపార వాణిజ్య కేంద్రాలపై ప్రత్యేకనిఘా ఉంటుందన్నారు.అంతేకాకుండా శాంతిభద్రలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా వదిలే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

-సుల్తాన్‌బజార్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా నరేష్

శాంతిభద్రతలను కాపాడేందుకు ప్రజలు సహకరించాలని సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా జి.నరేష్ పదవి భాద్యతలు స్వీకరించారు.ఇక్కడసిఐగా కొనసాగిన కె.నర్సింహ డబీర్‌పురా పోలీస్‌స్టేషన్‌కు బదిలీవెళ్లారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతలను కాపాడేందుకుగాను ప్రజలు సహకరించాలన్నారు.రాబోయే పండుగలకు కుల మతాలకు అతీతకంగా శాంతి భద్రతలను కాపాడేందుకు సహకరించాలని ప్రజలను కోరారు .శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా కఠినంగా శిక్షించడం జరుగుతుందన్నారు.

హైటెన్షన్ రోడ్డు నిర్మాణ పనులు పరిశీలించిన మైనంపల్లి

రోడ్డును పరిశీలిస్తున్న మైనంపల్లి

అల్వాల్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త: ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా హైటెన్షన్ రోడ్డు నిర్మాణ పనులను చేపట్టాలని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అధికారులను కోరారు. నాలుగున్నర కోట్లు వ్యయంతో బిబిఆర్ గార్డెన్స్ నుంచి పంచ్‌షీల్ కాలనీ వరకు రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. వాహన రాకపోకలకు తీవ్రమైన అంతరాయం ఏర్పడుతోందని స్థానికులు మైనంపల్లి దృష్టికి తెచ్చారు. శనివారం మాజీ కార్పొరేటర్ జితేందర్‌నాథ్, జిహెచ్‌ఎంసి, ట్రాఫిక్ విభాగాలకు చెందిన అధికారులుతో కలిసి రోడ్డును ఆయన పరిశీలించడం జరిగింది. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్మాణ పనులు చేపట్టే విధంగా యంత్రాంగం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

హైదరాబాద్ ఓపెన్ అమెచ్యూర్ గోల్ఫ్ అమూల్య

హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త

టీ గోల్ఫ్ ఫౌండేషన్ నిర్వహించిన ప్రతిష్టాత్మక హైదరాబాద్ ఓపెన్ అమెచ్యూర్ గోల్ఫ్ చాంపియన్‌షిప్‌లో అమూల్య విన్నర్‌గా నిలిచింది. గచ్చిబౌలి బౌల్డర్‌హిల్స్‌లో శనివారం ముగిసిన 18 హోల్ చాంపియన్‌షిప్ కోర్సులో అమూల్య 148 స్కోరుతో టాప్ ప్లేస్ సొంతం చేసుకుంది. గ్రాస్ విన్నర్ గా ట్రోఫీ, రూ. 90 వేల ప్రైజ్‌మనీ అందుకుంది. శ్వేత గుళ్లపల్లి (151) ఫస్ట్ రన్నరప్‌గా, అభిషేక్ మిత్రా (152) సెకండ్ రన్నరప్‌గా నిలిచారు. టోర్నీ ముగింపు వేడుకల్లో పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ వారికి ట్రోఫీలు అందజేశారు. హైదరాబాద్‌ను ఇంటర్నేషనల్ గోల్ఫ్ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దడంలో టీగోల్ఫ్ ఫౌండేషన్ కృషిని అభినందించారు. ఈ టోర్నీ రాష్ట్రంలో గోల్ఫ్ టూరిజాన్ని ప్రోత్సహించడమే కాకుండా, రైజింగ్ తెలంగాణ 2047 లక్ష్యానికి ఊతమిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో ప్రత్యామ్నాయ రాజకీయశక్తి అవసరం : కపిలవాయి దిలీప్‌కుమార్

హైదరాబాద్, ఫిబ్రవరి 21,ప్రభాతవార్త: జనాభాదామాషా ప్రకారం అన్ని వర్గాలకు సమాన వాటా దక్కాలంటే ప్రత్యామ్నాయ రాజకీయ శక్తి అవసరమని పలువురు వక్తలు పేర్కొన్నారు.శనివారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ రాష్ట్ర రాజకీయాలలో "ప్రత్యామ్నాయ రాజకీయ శక్తి అవసరమా?" అనే అంశంపై తెలంగాణ రాజకీయ కూటమి అధ్యక్షులు ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. దీనికి ముఖ్య అతిథులుగా కూటమి సెక్రటరీ జనరల్ మాజీ ఎంఎల్‌సి కపిలవాయి దిలీప్ కుమార్(లోల్‌దల్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు), వర్కింగ్ ప్రెసిడెంట్ తీగల ప్రదీప్ గౌడ్ (మహాజన సేన పార్టీ ఐధ్యక్షులు) కన్వీనర్లు రమావత్ లాలు నాయక్ (బహుజన రాజ్యం పార్టీ అధ్యక్షులుగా), కొలిశెట్టి శివకుమార్ (యుగ తులసి పార్టీ) బి. బశోక్ (ఎంటిఆర్‌ఎస్ పార్టీ), డేవిడ్ బండ్రియడ్ (ఇండియన్ సెక్యులర్ పార్టీ), మహమ్మద్ షకీల్ (ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్ పార్టీ), శేషగిరి (ఆధార్ పార్టీ)లు హాజరయ్యారు. ఈ సందర్భంగా కపిలవాయి దిలీప కుమార్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలను కల్పించాల్సిన అవసరం ఉన్నదన్నారు. తెలంగాణ రాజకీయ కూటమి త్వరలో లక్ష మంది యువతతో లక్ష సైన్యం ఏర్పాటు చేస్తుందని తెలిపారు. వినోద్‌కుమార్ మాట్లాడుతూ పరిపాలన ఒకరి సొత్తు కాదని, పరిపాలన విభజన జరగాలని పేర్కొన్నారు. ఒక సిద్ధాంతం,నాయకత్వం కార్యాచరణతో ముందుకెళ్తే దేనైనా సాధించవచ్చన్నారు. బిసి, ఎస్సి, ఎస్టి, మైనార్టీలను సిఎంలు చేయటమే తెలంగాణ రాజకీయ కూటమి లక్ష్యమనిఆదిశగా ఉద్యమిస్తామన్నారు. ఉచిత నాణ్యమైన విద్య, వైద్య, న్యాయం ప్రజలకు అందజేయాలని డిమాండ్ చేశారు. రైతు సంక్షేమం, మహిళా సాధికారత, రిజర్వేషన్లలో క్రీమీలేయర్ తప్పనిసరి చేయాలన్నారు.ఈ2సమావేశంలో ప్రొఫెసర్ లక్ష్మణ్, అడ్వకేట్ శరత్ కుమార్,జర్నలిస్టు రఘు పాల్గొన్నారు

సమావేశంలో మాట్లాడుతున్న దిలీప్‌కుమార్, ప్రొఫెసర్ గాలివినోద్‌కుమార్ తదితరులు

సమాజాన్ని సరైన గాడిలో పెట్టాల్సింది సాహితీవేత్తలే

ముషీరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త: ఎటువైపు పోతోందో తెలియని స్థితిలో ఉన్న సమాజాన్ని సరియైన దారిలో పెట్టాల్సిన బాధ్యత సాహితేవేత్తలపైనే ఉందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. శనివారం దోమలగూడలోని ఏవి కళాశాలలో తెలంగాణ సాహితి దశాబ్ది ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు కొనసాగే ఈ ఉత్సవాల ప్రారంభకు సభ తెలంగాణ సాహితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.ఆనందాచారి అధ్యక్షత వహించగా, ప్రముఖ కవి, విమర్శకులు నందిని సిధారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రజా వాగ్గేయకారులు, ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ డాక్టర్ రియాజ్‌లు గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిధారెడ్డి మాట్లాడుతూ సాహిత్యం తెలిస్తే లోకం తెలుస్తుందని, నేటి యువత సాహిత్యాన్ని చదవాల్సిన అవసరం ఎంతో ఉందని అన్నారు. నేటి సినిమాలలో సాహిత్య ప్రాధాన్యత తగ్గిపోయి, సంగీత హోరు పెరిగిపోయిందని, వాటి మోజులోపడి, యువత గాలికి కొట్టుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పదేళ్ల క్రితం ప్రారంభమయిన సాహితీ సంస్థ ఎన్నో ఆటుపోట్లు, సవాళ్లను ఎదుర్కొని, నిలబడటం హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాహిత్య అకాడమీ ఛైర్మన్ ఏనుగు నర్సింహారెడ్డి, కార్యదర్శి బాలాచారి, కేంద్ర సాహిత్య యువ పురస్కారగ్రహీత శివలింగప్ప, కళోజి అవార్డు గ్రహీత నెల్లుట్ల రమాదేవి, ప్రొఫెసర్ బన్న ఐలయ్య, ప్రముఖ కవులు యాకుబ్, వువ్వా శ్రీనివాసరావు, ఎస్.రఘు, కళాశాల ప్రిన్స్‌పాల్ సి.హెచ్.రాజలింగం పాల్గొనగా, సాహితీవేత్త సలీమ వందన సమర్పణ చేశారు.

తెలంగాణ సాహితి దశాబ్ది ఉత్సవాలను ప్రారంభిస్తున్న నందిని సిధారెడ్డి

మాదిగలు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగవలసిన అవసరం ఉంది : మోత్కుపల్లి నర్సింహులు

చిక్కడపల్లి ఫిబ్రవరి 21 (ప్రభాతవార్త) : తెలంగాణలో అత్యధిక జనాభా కలిగిన మాదిగలు, రాజకీయంగా, ఆర్థికంగా ఎదగవలసిన అవసరం ఎంతైనా ఉందని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు అన్నారు. శనివారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బంధు సొసైటీ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం, పాత కమిటీ ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం సొసైటీ అధ్యక్షులు పల్లెల వీరస్వామి ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మోత్కుపల్లి నర్సింహులు హాజరై నూతన కమిటీ అధ్యక్షులుగా పల్లెల వీరస్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బి ఎల్లయ్య కార్యదర్శిగా మంద కనకయ్య, ఆర్గనైజర్‌గా వశపాక నరసింహ, కోశాధికారి గాపి ఆంజనేయులు, ఎగ్జిక్యూటివ్ కమిటీగా గండి కృష్ణ ఎస్ నరసింగరావు, ఎస్ సత్యనారాయణ, సి రవీంద్రా లసభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. మానకొండూరు ఎమ్మెల్యే , తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, విశ్రాంత ఐఆర్ టీఎస్ అధికారి డాక్టర్ అప్పికట్ల భరత్ భూషణ్ పాల్గొని ప్రసంగించారు. పల్లెల వీరస్వామి మాట్లాడుతూ షెడ్యూల్ కులాల కోసం కేటాయించిన సబ్ ప్లాన్ నిధులను వెంటనే విడుదల చేయాలని, విదేశాలలో చదువుల కోసం ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీ కొనసాగించాలని , ఎస్సీ కార్పొరేషన్ నిధులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మోత్కుపల్లి నరసింహులు మాట్లాడుతూ తెలంగాణలో అత్యధిక జనాభా కలిగిన మాదిగలు, రాజకీయంగా, ఆర్థికంగా ఎదగవలసిన అవసరం ఎంతైనా ఉందని దానికోసం మాదిగ మహాశక్తి తెలంగాణ రాష్ట్రంలో పెద్ద ఎత్తున పనిచేస్తుందని అన్నారు.

మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు బంద్ సొసైటీ నూతన కమిటీ సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించిన దృశ్యం

బిసిల అవకాశాలపై ప్రభుత్వ దాటవేత ఇంకెంతకాలం?

-బిసి రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేశ్

చిక్కడపల్లి ఫిబ్రవరి 21 ప్రభాతవార్త : బాగ్ లింగంపల్లిలోని కేంద్ర కార్యాలయంలో బీసీల బడ్జెట్, రాబోయే గ్రేటర్, పరిషత్ ఎన్నికల్లో బీసీల ప్రాతినిధ్యాన్ని పెంచడానికి అఖిలపక్ష సమావేశాన్ని బిసి రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేశ్ ఆధ్వర్యంలో బీసీ రాజ్యాధికార సమితి పొలిటికల్ అఫైర్స్ కమిటీ చైర్మన్ తులసి శ్రీమాన్,మహిళా ముఖ్య కార్యదర్శి పోశాల సరస్వతి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు.. గ్రామ పంచాయితీ, మున్సిపల్ ఎన్నికల ఫలితాలను జిల్లాల వారీగా సమీక్షించారు. దాసు సురేష్ మాట్లాడుతూ... బిసి రాజ్యాధికార సమితి రాష్ట్రవ్యాప్తంగా క్షేత్రస్థాయిలో నిర్వహించిన వందలాది కార్యక్రమాల ఫలితంగా నేడు రాష్ట్రంలో జరిగిన గ్రామపంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో అనుకూల ఫలితాలు రావడం గొప్ప పరిణామమనీ ఈ ఫలితాలను బీసీల అభ్యున్నతి కోసం పాటుపడుతున్న నాయకులకు అంకితవిస్తున్నామని వెల్లడించారు. మంత్రి వర్గంలో కానీ, నామినేటెడ్ పదవుల్లో కానీ, ప్రమోషన్లలో కానీ,ప్రాధాన్యత కలిగిన రంగాల్లో కానీ, బీసీల ప్రాతినిధ్యం నామమాత్రంగా ఉండటం బీసీలపై కొనసాగుతున్న వివక్షతకు నిదర్శనమని అన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ అనుసరించి బీసీలకు అన్ని విద్యా, ఉద్యోగ, వ్యాపార, కాంట్రాక్టర్ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లను అందిస్తామన్న హామీని అపహాస్యం చేస్తున్నారు యునైటెడ్ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ వీ జీ ఆర్ నారగోని మాట్లాడుతూ రాష్ట్రంలో పెరిగిన బీసీల రాజకీయ చైతన్యం ప్రశ్నించి సాధించుకోవటమే మన ముందున్న ప్రధాన కర్తవ్యం అని అన్నారు. ప్రభుత్వం ఐదు సంవత్సరాల గాను, బీసీలకు లక్ష కోట్లు ఖర్చు చేస్తామన్నా హామీని తుంగలో తొక్కారన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ ఫ్రంట్ కన్వీనర్ దుర్గయ్య గౌడ్, యువ నాయకులు గుండేటి శ్రీధర్, గ్రేటర్ హైదరాబాద్ మహిళా ప్రధాన కార్యదర్శి శ్రీలత, గ్రేటర్ హైదరాబాద్ సీనియర్ నాయకులు మంద వెంకటస్వామి, బొమ్మ నరేందర్ మంద ఈశ్వర్ అడ్వకేట్ సుదర్శన్, జోగు శ్రీనివాస్, మల్కాజిగిరి జిల్లా బిసి రాజ్యాధికార సమితి నాయకులు శోభ, ఆనంద్, జ్యోతి, ఎల్లయ్య, మధుసూదనా చారి, పోలీస్ అధికారి రవీందర్, వడ్డేపల్లి జనార్ధన్, రంగయ్య పాల్గొన్నారు

సమావేశంలో ప్రసంగిస్తున్న బిసి రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేశ్

ఉద్యమకారులను గుర్తించడానికి చట్టబద్ధత కలిగిన కమిటీని వేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న పాశం యాదగిరి

సైఫాబాద్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త: తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపుకు ప్రభుత్వం చట్టబద్ధత కలిగిన కమిటీని తక్షణమే నియమించాలని సీనియర్ పాత్రికేయులు పాశం యాదగిరి కోరారు. రాష్ట్ర మంత్రి ప్రకటనను అమలు చేసే దిశగా ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. తెలంగాణ ఉద్యమ సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యమకారులను గుర్తించేందుకు కమిటీ ఏర్పాటు చేయడం ద్వారా ప్రభుత్వం తన నిబద్ధతను చాటుకోవాలన్నారు. ఉద్యమకారుల అంశంపై క్యాబినేట్‌లో చర్చించి త్వరలో జివొను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం ఉద్యమకారులను నిర్లక్ష్యం చేసిందని, ఈ ప్రభుత్వం ఉద్యమకారులు ఇళ్ల స్థలాలు, పెన్షన్, ఉద్యోగాలు కల్పించాలని కోరారు. కమిటీ కన్వీనర్ కుమారస్వామి మాట్లాడుతూ రాష్ట్ర మ ంత్రి పొన్నం ప్రభాకర్ ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని కోరారు. శ్రీకాంతాచారి తండ్రి వెంకటచారి మాట్లాడుతూ వందలాది మంది ఉద్యమకారుల త్యాగాల వల్లనే తెలంగాణ వచ్చిందని, ఉద్యమకారులకు న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఉద్యమకారులు జానికిరెడ్డి, గడ్డం సదానందం, గుండమల్ల శ్రీను, కొంతం యాదిరెడ్డి, జగదీష్, మాధవి, జ్యోతి పాల్గొన్నారు.

కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలిసిన బిజెపి నేతలు

అత్తాపూర్ ఫిబ్రవరి 21, ప్రభాతవార్త : కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ రాజేంద్రనగర్ లోని నారంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ లోని బిజెపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.ఈ కార్యక్రమంలో బిజెపి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పంతంగి రాజగోపాల్ గౌడ్, ప్రధాన కార్యదర్శి వై శ్రీధర్, చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి కొమురయ్య, రాజేంద్రనగర్ అసెంబ్లీ కన్వీనర్ పి మల్లేష్ యాదవ్, పార్టీ నాయకులు హరికిషన్, సోల్కర్ రెడ్డి, బిజెపి మహిళా మోర్చా కార్యదర్శి మేకల వనితా రెడ్డి, అత్తాపూర్ డివిజన్ పార్టీ మాజీ అధ్యక్షులు షాబాద్ విజయ్, డివిజన్ అధ్యక్షులుసందీప్ ముదిరాజ్, సీనియర్ నాయకులు రాచూరి రాజశేఖర్,బండారి బాలకృష్ణ, రాజశేఖర్ రెడ్డి, కవిత, గౌరీదేవి, కిట్టు,వేణు గోపాల్, రాజు, మణికంఠ,ఉపేందర్ రెడ్డి,విజయ్ యాదవ్, శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు

నిరంతర అధ్యయనంతో విజయం స్వంతం

-ఇన్కమ్‌టాక్స్ ఐటిఏటి ఉపాధ్యక్షుడు విజయ్‌పాల్‌రావు

హైదరాబాద్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త

నిరంతర అధ్యయనంతో పాటు సబ్జెక్ట్ పూర్తి స్థాయిలో అవగాహన ఉన్నప్పుడే జీవితంలో విజయం స్వంతం అవుతుందని హైదరాబాద్ జోన్ ఇన్కమ్‌టాక్స్ అప్పిలేట్ ట్రిబ్యునల్(ఐటిఏటి) వైస్ ప్రెసిడెంట్ విజయ్‌పాల్‌రావు అన్నారు. బిర్లా ప్లానిటోరియంలోని భాస్కర ఆడిటోరియంలో శనివారం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ టాక్స్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 5వ మూట్ ట్రిబ్యునల్ పోటీల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విజయ్‌పాల్‌రావు మాట్లాడుతూ సిఎ, న్యాయవాది వృత్తిలో రాణించాలంటే అదృష్టం కంటే హార్డ్‌వర్క్ ముఖ్యమని అన్నారు. ఏదైనా విషయంపై పూర్తి పట్టు సాధించినప్పుడే, ఆయా విషయాల్లో గెలుపు సులభం అవుతుందని చెప్పారు. సీనియర్ల సలహాలు తీసుకుంటూ నిత్య విద్యార్థిలా మెదిలినపుడే వృత్తిలో నైపుణ్యం సాధించి, జీవితాంతం వృత్తిలో రాణించగలమన్నారు. న్యాయమూర్తి ముందు వాదనలు వినిపించే సమయంలో ఎదుటి వ్యక్తి సంధించే ప్రశ్నలకు తమదైన శైలిలో విషయ పరిజ్ఞానంతో బదులు చెప్పినప్పుడే విజయం సాధించవచ్చని విజయ్‌పాల్‌రావు తెలిపారు. తెలంగాణ, ఏపి టాక్స్ బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు సిఎ చంద్రశేఖర్ వేముల మాట్లాడుతూ మూట్ ట్రిబ్యునల్ కాంపిటీషన్ కార్యక్రమం యువ చార్టెర్డ్ అకౌంటెంట్స్, న్యాయవాదులు తమ వృత్తి పట్ల అవగాహన పెంపొందించుకునేందుకు దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమానికి యువ చార్టెర్డ్ అకౌంటెంట్స్(సిఎ), న్యాయవాదులు పెద్ద ఎత్తున హాజరై, మూట్ ట్రిబ్యునల్ పోటీల్లో పాల్గొని తమ తమ వృత్తిలో ఉండే విషయాలపై చర్చించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి టాక్స్ బార్ అసోసియేషన్ బహుమతులతో పాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా ఐటిఏటి హైదరాబాద్ బెంచ్ అకౌంట్ మెంబర్లు మంజునాథ జి, మధుసూధన్ సవిదా, జ్యూడిషియల్ మెంబర్ రావిష్ సూద్ హాజరయ్యారు. అలాగే మూట్ ట్రిబ్యునల్ పోటీల న్యాయ నిర్ణేతలుగా ఐటిఏటి హైదరాబాద్ జోన్ ఉపాధ్యక్షుడు డి. మన్మోహన్, ఐటిఏటి మాజీ అకౌంట్ మెంబర్ బి.రామకోటయ్య, అసోసియేషన్ కార్యదర్శి అశిష్ జోషి, కోశాధికారి సోమశేఖర్ నెమ్మని, చైర్మన్ అమ్రిత్ కుమార్ కోట, కన్వీనర్ పంకజ్ సంచేటి, కో కన్వీనర్లు లీల కృష్ణమోహన్ కోట, ప్రవళిక వేముల వ్యవహరించారు.

మూట్ ట్రిబ్యునల్ పోటీల కార్యక్రమం నుద్దేశించి మాట్లాడుతున్న ఇన్కమ్‌టాక్స్ అప్పిలేట్ ట్రిబ్యునల్(ఐటిఏటి) వైస్ ప్రెసిడెంట్ విజయ్‌పాల్‌రావు

అమ్మ భాషను మరవొద్దు, అమ్మ నాన్న అనే పిలుపులోనే కమ్మదనం

హైదరాబాద్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త: ఎన్ని భాషలు నేర్చినా అమ్మ భాషను మరవొద్దని ప్రముఖ పాత్రికేయులు, బాల సాహిత్య కవి, రచయిత తిరునగరి వేదాంతసూరి బాలలకు ఉద్బోధించారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరుమలగిరిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నిర్వహించిన వేడుకలల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. అమ్మ అనే పిలుపులోనే కమ్మదనం ఉందని, ప్రతి విద్యార్థి మమ్మి, డాడి కాకుండా అమ్మ నాన్న అనే పిలుపును అలవాటు చేసుకోవాలని సూచించారు. మన దేశంలో లేని అభిమానం పరాయి దేశంలో లభిస్తున్నదని, విదేశాల్లో మన భాష వినిపిస్తే ఆ ఆనందం మాటల్లో చెప్పలేమని, ప్రతి విద్యార్థి తెలుగు భాష పట్ల మక్కువ కలిగి ఉండాలని, మీకు తోచిన కథ కవిత వ్యాసం ఏదైనా రాసే ప్రయత్నం చేయాలని చెప్పారు. తాను నిర్వహించే 'మొలక' అంతర్జాల పత్రిక మీ రచనలకు వేదిక అని చెప్పారు. పాఠశాల ప్రధానోధ్యాయులు భరద్వాజ మాట్లాడుతూ మాతృభాషపై మమకారం వదలవద్దని అమ్మ ప్రేమలాంటిదే మాతృభాష అని, ఆంగ్లం చేర్చుకోవడం తప్పనిసరి అయినప్పటికి మాతృభాషను మాత్రం చులకన చేయరాదని తప్పకుండా గౌరవించాలని సూచించారు. పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు డా. కృష్ణమూర్తి మాట్లాడుతూ తెలుగు భాష ఔన్నత్యాన్ని గోప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా వ్యాసరచన, వక్తృత్వం, పద్య పఠన పోటీ, కథల పోటీలు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో కొనసాగాయి. 50 మంది విద్యార్థులు ఈ పోటీల్లో ఉత్సహంగా పాల్గొనగా విజేతలకు ముఖ్యఅతిథి బహుమతులు ప్రదానం చేశారు. ముఖ్యఅతిథిని ప్రధానోపాధ్యాయులు పుష్పమాల

సైబర్ నేరాలపై సమరం..

-పోలీసులతో ఇన్ఫ్లుయెన్సర్ల జత
-జాగృత్ హైదరాబాద్ ..సురక్షిత్ హైదరాబాద్ క్యాంపెయిన్
-షార్ట్ విడియోలతో మోసాలపై వినూత్న అవగాహన
-నవ్విస్తూనే కళ్లు తెరిపిస్తున్న కంటెంట్ క్రియేటర్లు
-సామాజిక బాధ్యతగా ముందుకు రావాలని సిపి సజ్జనార్ పిలుపు

ఆలోచింపజేస్తున్న వీడియోలు..

హైదరాబాద్, ఫిబ్రవరి 21,ప్రభాతవార్త: సైబర్ నేరాలను సమర్థవంతంగా అరికట్టేందుకు హైదరాబాద్ సిటీ పోలీసులు సరికొత్త వ్యూహంతో ముందుకు వెళ్తున్నారు. కేవలం అధికారిక హెచ్చరికలకే పరిమితం కాకుండా, సామాన్యులకు సైతం సులువుగా అర్థమయ్యే రీతిలో సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ల ద్వారా విస్తృత అవగాహన కల్పిస్తున్నారు. హైదరాబాద్ సిపి వీసీ సజ్జనర్ ఆధ్వర్యంలో విజయవంతంగా కొనసాగుతున్న "జాగృత్ హైదరాబాద్ - సురక్షిత్ హైదరాబాద్" కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఈ నూతన విధానానికి విశేష స్పందన లభిస్తోంది. పోలీసుల పిలుపు మేరకు పలువురు ప్రముఖ సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి, సైబర్ నేరాల తీరుతెన్నులను వివరిస్తూ తమదైన శైలిలో వీడియోలు రూపొందిస్తున్నారు. వీటిని సిపి సజ్జనర్, ఇన్స్టాగ్రామ్ ఖాతాలతో కొలాబరేట్ చేయడం ద్వారా లక్షలాది మందికి చేరువ చేస్తున్నారు. వినోదాత్మకంగా ఉంటూనే, అత్యంత కీలకమైన సైబర్ భద్రతా సూచనలను ఈ వీడియోలు ప్రజలకు అందిస్తున్నాయి.

ఇన్ఫ్లుయెన్సర్లు ఇటీవల రూపొందించిన వీడియోలు ఎంతో వైవిధ్యంగా ఉండి నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. లాటరీ మోసాలపై కళ్లు తెరిపిస్తూ "దేశీ మామ్ వర్సెస్ స్కామర్" కాన్సెప్ట్‌తో రూపొందిన వీడియో ప్రాక్టికల్‌గా ఆలోచింపజేస్తోంది. "మీకు రూ.25 లక్షల లాటరీ తగిలింది.. ప్రాసెసింగ్ ఫీజు కోసం ఓటీపీ చెప్పండి" అంటూ వచ్చే ఫేక్ కాల్స్‌ను ఓ గృహిణి ఎంత చాకచక్యంగా తిప్పికొట్టిందనేది ఇందులో చూపించారు. అత్యాశకు పోకుండా, అపరిచితులతో బ్యాంక్ వివరాలు, ఓటీపీలు పంచుకోకూడదనే స్పష్టమైన సందేశాన్ని బలంగా వినిపించారు.

డిజిటల్ అరెస్ట్‌పై కనువిప్పు..

ప్రస్తుతం తీవ్ర కలకలం రేపుతున్న డిజిటల్ అరెస్ట్ మోసాల గుట్టును మరో వీడియో ద్వారా విప్పారు. సైబర్ నేరగాళ్లు సీబీఐ, పోలీస్, ఆర్బీఐ అధికారులమంటూ నకిలీ యూనిఫామ్స్ ధరించి.. వీడియో కాల్స్ ద్వారా ఏ విధంగా భయభ్రాంతులకు గురిచేస్తారో కళ్లకు కట్టారు. "భారతదేశంలో ఏ ప్రభుత్వ దర్యాప్తు సంస్థ వీడియో కాల్ ద్వారా విచారణ చేయదు" అన్న వాస్తవాన్ని ప్రజలకు స్పష్టం చేశారు. సైబర్ నేరగాళ్ల నుంచి ఫేక్ కాల్స్ వస్తే భయపడకుండా.. తక్షణమే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు డయల్ చేయాలని ఈ వీడియోల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. సామాన్యులకు సైతం సులువుగా అర్థమయ్యేలా పోలీసులు, ఇన్ఫ్లుయెన్సర్లు సంయుక్తంగా చేస్తున్న ఈ ప్రయోగానికి నెటిజన్ల నుంచి అద్భుతమైన మద్దతు, ప్రశంసలు లభిస్తున్నాయి.

ఫాలోయింగ్‌ను సమాజ హితం కోసం వాడండి: సిపి సజ్జనార్

సైబర్ నేరాల కట్టడికి మరింత మంది సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు, కంటెంట్ క్రియేటర్లు ముందుకు రావాలని పోలీస్ కమిషనర్ సజ్జనం విజ్ఞప్తి చేశారు. "సామాజిక మాధ్యమాల్లో మీకు విశేషమైన ఫాలోయింగ్, గుర్తింపు ఉన్నాయి. దాన్ని సమాజ మార్పు కోసం వినియోగించండి. మీ మాటలకు ప్రజల ఆలోచనా విధానాన్ని మార్చే శక్తి ఉంది. సైబర్ నేరాలపై ప్రభావవంతమైన షార్ట్ వీడియోలు రూపొందించి మీ ప్లాట్‌ఫామ్స్ ద్వారా షేర్ చేయండి. సురక్షితమైన, చైతన్యవంతమైన సమాజ నిర్మాణం మనందరి ఉమ్మడి బాధ్యత," అని ఆయన పిలుపునిచ్చారు.

రైతులు కూరగాయ పంటల సాగుకు మొగ్గు చూపాలి

అత్తాపూర్ ఫిబ్రవరి21,ప్రభాతవార్త : రాష్ట్రంలో కూరగాయల కోరత 50శాతంపైగానే ఉందని అందుకే పలు ఇతర రాష్ట్రాలైన కర్ణాటక ,మహారాష్ట్ర,చత్తీస్‌గడ్,ఆంధ్రప్రదేశ్,తమిళనాడు రాష్ట్రం నుంచి పలు కూరగాయలు దిగుమతి చేసుకుంటున్నామని దీన్ని అధికమించేందుకు రైతులు కాయగూరల సాగు చేయాలని తద్వారా రైతులు మెరుగైన ఆదాయం పొందవచ్చునని ఉద్యాన శాఖ డైరెక్టర్ షేక్ యాస్మిన్ భాష అన్నారు.రాజేంద్రనగర్‌లోని కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం వేధికగా జరుగుతున్న కూరగాయల పంటలపై అఖిలభారత సమన్వయ పథకం 44వ వార్షిక సమావేశం రెండవ రోజు కార్యక్రమానికి చైర్‌పర్సన్‌గా హాజరైన ఉద్యాన శాఖ డైరెక్టర్ షేక్ యాస్మిన్ భాష మాట్లాడారు...కూరగాయ పంట్లో ఉత్పత్తి పెంచేందుకు అవసరమైన సాంకేతిక సలహాలు,సూక్ష్మ సేద్య పరికరాలు మిషనరీ సబ్సిడిపై అందిస్తామని,అధిక దిగుబడినిచ్చే రకాలు సిఫార్సు చేస్తామని అన్నారు.మిగతా పంటలతో పోలిస్తే కూరగాయల పంట్లో తక్కువ కాలంలో దిగుబడి సాధ్యమని తద్వారా మేలైన ధరతో సాగు రైతులకు గిట్టుబాటు అవుతుందని అన్నారు.అధిక వేడిని తట్టుకునే రకాలు,ముడత రోగం తట్టుకునే రకాలు,వైరస్‌ను తట్టుకునే రకాలు,ఎండు తెగులు తట్టుకోవడంతో పాటు అధిక నాణ్యత కలిగిన రకాలు రాష్ట్రంలో సాగుకు అవసరమని ఆమె అన్నారు. సాధ్యమైనంత ఎక్కువ రైతు క్షేత్రాల్లో నూతన రకాలు, ఉత్తమ పద్ధతులను ప్రదర్శించి రైతులకు అందజేస్తామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఉద్యాన వర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ దండ రాజిరెడ్డి, ఐ సి ఆర్ అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సుధాకర్ పాండే, వారణాసిలోని భారతీయ కూరగాయల పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ రాజేష్ కుమార్, బెంగళూరులోని ఐ హెచ్ ఆర్ డైరెక్టర్ డాక్టర్ టికె బెహరా, అని ఎన్‌బిపిజిఆర్ డైరెక్టర్ డాక్టర్ జిపి సింగ్, మాజీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ల్నవడి, ఎన్ ఐ ఆర్ సి ఏ రాజమండ్రి డైరెక్టర్ డాక్టర్ శేషు మాధవ్, పరిశోధన సంచాలకులు లక్ష్మీనారాయణ, లోకల్ ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ అనిత కుమారి, డాక్టర్ చీనా, డాక్టర్ పి ప్రశాంత్, దేశవ్యాప్తంగా కూరగాయల్లో పరిశోధన చేస్తున్న 300 మంది శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

ఓటర్ల మ్యాపింగ్ సర్వే వేగంగా చేపట్టాలి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి

ఓటర్ల మ్యాపింగ్ సర్వేను పరిశీలిస్తున్న రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి, ఆర్.వి.కర్ణన్ తదితరులు

హైదరాబాద్, ఫిబ్రవరి 21,ప్రభాతవార్త: ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ముందస్తు సన్నాహాల్లో భాగంగా హైదరాబాద్‌లో చేపడుతున్న ఓటర్ల మ్యాపింగ్ సర్వేమరింత చురుగ్గా, వేగంగా జరిగేలా చూడాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి ఈఆర్‌వో, ఏఈఆర్‌వోలను ఆదేశించారు. ఈమేరకు శనివారం హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఆర్ వి కర్ణన్ తో కలిసి సికింద్రాబాద్ నియోజకవర్గంలోని మాణికేశ్వర్ నగర్ పోలింగ్ కేంద్రం 211 పరిధిలో ఓటరు జాబితాసవరణ చేపట్టిన ప్రోజెన్సీ మ్యాపింగ్‌ను ఆకస్మికంగా పరిశీలించారు. అనంతరం చార్మినార్ నియోజకవర్గంలోనిలో కబుత్తరుఖానా పోలింగ్ కేంద్రం 12 పరిధిలో ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం బూత్ లెవెల్ అధికారులు, సూపర్ వైజర్‌లతో మాట్లాడారు.మ్యాపింగ్ ఎట్లా చేస్తున్నారంటూ ప్రశ్నించారు. మ్యాపింగ్ పై వారికి ఉన్న అవగాహన ను పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి.. 2002 జాబితాలోని ఓటర్ల కుటుంబ సభ్యుల వివరాలను 2025 జాబితాను పోల్చుతున్నామని తెలిపారు. 2002 జాబితాలో పేర్లున్న ఓటర్ల కుటుంబ సభ్యుల వివరాలు సేకరించి... ప్రస్తుత జాబితాలో ఉంటే వారి పేర్లను మ్యాపింగ్ చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకూ జరిగిన ప్రోజెన్సీ మ్యాపింగ్ పురోగతిని ఈఆర్‌వోలు ప్రధాన ఎన్నికల అధికారికి తెలిపారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ... భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ప్రోజెన్సీ మ్యాపింగ్ పకడ్బందీగా చేపట్టాలన్నారు. ప్రోజెన్సీ మ్యాపింగ్ చురుగ్గా చేపట్టి వేగంగా పూర్తి చేయాలన్నారు. ఎన్నికల జాబితాల్లో కచ్చితత్వం, పారదర్శకత, సమగ్రతను పాటించడమే లక్ష్యంగా కేంద్ర ఎన్నికల సంఘం తెలంగాణలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం చేపట్టనుందని తెలిపారు. క్షేత్ర పరిశీలనలో ప్రధాన ఎన్నికల అధికారి వెంట అదనపు కమిషనర్ (ఎన్నికల విభాగం) చంద్రకళ, సరిత, ఆంజనేయులు, సుధీర్ రెడ్డి, ఎన్నికల విభాగం సహాయ మున్సిపల్ కమిషనర్ విమల తదితరులు ఉన్నారు.

ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన రైతు బాడీ అగ్రి షో 2026 యొక్క 3వ ఎడిషన్‌ను సందర్శించిన మాజీ మంత్రి హరీష్ రావు, హరియాణ మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

ఉత్తమ పౌరులుగా ఎదగాలంటే జ్ఞానసంపద పెంచుకోవాలి

-జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి

హైదరాబాద్, ఫిబ్రవరి 22,ప్రభాతవార్త: ఉత్తమ పౌరులుగా ఎదిగేందుకు విద్యార్థులు నిరంతర జ్ఞానసంపద పెంచుకోవాలని జిల్లా కలెక్టర్ హరిచంద్ర దాసరి అన్నారు.శనివారం అబిడ్స్‌లోని స్టాన్లీ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రపంచ ఆలోచనా దినోత్సవం (వరల్డ్ థింకింగ్ డే) సందర్భంగా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 22న స్కౌట్ ఉద్యమం స్థాపకుడు లార్డ్ రాబర్ట్ స్టీఫెన్సన్ స్మిత్ బాడెన్ పోవెల్ జన్మదినం రోజును ప్రపంచ ఆలోచన దినోత్సవంగా జరుపుకోబడుతుందని కలెక్టర్ వివరించారు. ఈసందర్భంగా విద్యార్థులను ఉద్దేశిస్తూ మాట్లాడుతూ మానవ జీవనశైలిలో ఆలోచన అత్యవసరమైన నైపుణ్యమని తెలుపుతూ చదువుతో పాటూ, శారీరక, మానసిక, సామాజిక సర్వతోముఖాభివృద్ధి ఎంతో ముఖ్యమన్నారు. విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదిగేందుకు నిరంతర జ్ఞానసంపద, విశ్లేషణ, ప్రశ్నించే తత్వం ముఖ్యమని అన్నారు. క్రమశిక్షణ, నాయకత్వం, ఐక్యత, సమాజసేవ వంటి విలువలను పెంచేదిశగా స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థ చేస్తున్న కృషిని అభినందించారు. అలాగే కొత్త ఆలోచనలు , ఆవిష్కరణల ద్వారా జీవితంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. విద్యార్థులు రేపటి భవిష్యత్ పునాదులు కాబట్టి చురుకైన ఆలోచనా విధానాన్ని అలవరచుకోవాలని, తద్వారా ఇంట్లో, పాఠశాలలో , సమాజంలో తమ చుట్టూ ఉన్న పరిస్థితులను ఎలా మెరుగుపరచవచ్చో ఆలోచించాలని ఆమె విద్యార్థులను సూచించారు. అనంతరం వివిధ పోటీల్లో పాల్గొన్న విజేతలకు మెమెంటోలు అందించి ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆర్గనైజర్ , స్కౌట్ మాస్టర్ రాములు నాయక్, వివిధ పాఠశాలల స్కౌట్ మాస్టర్లు, స్కౌట్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల నిర్లక్ష్యానికి.. పసిబాలుడు మృతి

-కుటుంబ సభ్యుల్లో నింపిన విషాదం

శిశువు మృత దేహంతో ఏడుస్తున్న తల్లి, కుటుంబ సభ్యులు

అత్తాపూర్ ఫిబ్రవరి 21, ప్రభాతవార్త : వైద్యుల నిర్లక్ష్యానికి వైద్యం వికటించి ఆరు నెలల శిశువు మృతి చెందిన విషాద ఘటన రాజేంద్రనగర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం... బండ్లగూడ జాగీర్ పరిధిలోని వికాస్ నగర్‌లో ఉండే విష్ణువర్ధన్‌రెడ్డి, అశ్వినీ దంపతులకు ఇద్దరు కుమార్తెలు,మూడో సంతానంగా ఆరు నెలల కుమారుడు ఉన్నారు. శనివారం కుమారుడికి జ్వరం రావడంతో స్థానిక క్రేయాన్స్ హాస్పిటల్ ఫర్ ఉమెన్ అండ్ చిల్డ్రన్స్‌కు తీసుకువెళ్లగా వైద్యుడు అభిషేక్, సిబ్బంది బాలుడు రామును పరిశీలించి గడువు ముగిసిన ఇంజక్షన్ ఇచ్చారు. అది వికటించింది. కొద్దిసెప్పటికే బాలుడు చూస్తుండగానే తల్లి ఒడిలో ప్రాణాలు వదిలాడు. గుండె ఎక్కువ వేగంతో కొట్టుకోవటం కోసం ఇచ్చే ఇంజక్షన్ వేశారు. ఆ మందు ప్రభావం తట్టుకోలేక ప్రాణాలు విడిచాడు. ఉన్న ఒక్కగానొక్క వంశాంకురం డాక్టర్ల నిర్లక్ష్యానికి బాలికావటం ఆకుటుంబాన్ని తీవ్రంగా కలిచి వేసింది. తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమైయ్యారు. ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ బాధిత బంధువులు, స్థానికులు హాస్పిటల్ ఎదుట ఆందోళనకు దిగారు. పోలీసులు జోక్యం చేసుకొని వారిని శాంతింపచేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు హాస్పిటల్‌పై కేసు నమోదు చేస్తున్నారు.

ఇంటి యజమాన్ని బాధలను భరించలేక గృహిణి ఆత్మహత్య

అల్వాల్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త: ఇంటి యజమాని బాదలను భరించలేని గృహిణి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన అల్వాల్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. హస్మత్‌పేట్ అబ్రహార్ మస్జిద్ సమీపంలో షేక్ సాబేర్ తనభార్య తబాసుమ్(42) నలుగురు సంతానంతో నివాసం ఉంటున్నాడు. రెండు రోజులు క్రితం ఇరవై ఏళ్ళుగా అద్దెకు ఉంటన్న ఇంటిని ఖాళీ చేసి సమీపంలోని మాల బస్తీకి వెళ్ళడం జరిగింది. ఈ నెల 20వ తేదీ సాయంత్రం 3 గంటలు సమయంలో తబాసుమ్ పాత ఇంటిలో మిగిలి ఉన్న బట్టలు ఇతర సామగ్రి తీసుకోవడానికి వెళ్ళింది. అక్కడి నుంచి భర్త షేక్ సాబేర్‌కు ఓ. వాట్సప్ మెసెజ్ చేసింది. ఇంటి యజమాని తనను మానసికంగా హింసిస్తున్నాడని, అడ్వాన్స్ తిరిగి ఇవ్వక పోగా మోటార్ ఇతర వస్తువులు పాడైనట్లు చెబుతున్నట్లు తెలిపింది. తన అనుమతి లేకుండా పలుమార్లు ఇంటి లోపలకి వచ్చి ఇబ్బందులకు గురి చేసే వాడని పేర్కొంది. ఐదున్నర గంటలు సమయంలో భార్య కోసం పాత ఇంటికి వచ్చి చూసే సరికి భార్య వంట గదిలో ఉరి వేసుకుని ఉంది. షేక్ సాబేర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఫ్లైఓవర్ల నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి

-అధికారులను ఆదేశించిన మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి

మల్కాజిగిరి నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో సమీక్ష నిర్వహిస్తున్న కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి

హైదరాబాద్ ఫిబ్రవరి 21 (ప్రభాతవార్త) : మల్కాజిగిరి నగరపాలక సంస్థ (ఎం.ఎం.సి) పరిధిలో చేపట్టిన ప్రతిష్టాత్మక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు హెచ్‌సిటీ , ఎస్.ఎన్.డి.పి) పనుల పురోగతిపై కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. మల్కాజిగిరి నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో చీఫ్ ఇంజనీర్ అశోక్ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్ ఇతర ఉన్నతాధికారులతో కలిసి పనుల స్థితిగతులను సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ హెచ్‌సిటీ (హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫార్మటివ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్) ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన 4 కీలక ఫ్లైఓవర్ల నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రధానంగా ఏఓసీ సెంటర్ ఫ్లైఓవర్, రోడ్ ఓవర్ బ్రిడ్జి లైన ఆర్.కె పురం , ఆర్.కె పురం , టీకేఆర్ కమాన్ నుండి మంద మల్లమ్మ వరకు ఫ్లైఓవర్ ప్రాజెక్టులకు సంబంధించి పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని, ఎక్కడా జాప్యం జరగకుండా చూడాలని స్పష్టం చేశారు. అనంతరం ఎస్.ఎన్.డి.పి పనులపై సమీక్షిస్తూ మొత్తం 9 కొత్త నాలాల పనులలో ఇప్పటికే 6 నాలాల పనులు పురోగతిలో ఉన్నాయని, మిగిలిన 3 నాలాల పనులను తక్షణమే వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలం ప్రారంభం కాకముందే నాలాల పూడికతీత పనులన్నీ పూర్తి చేయాలని, తద్వారా లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల ఇంజనీరింగ్ అధికారులు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ క్రైమ్ అవగాహన సదస్సు

న-పాల్గొన్న సికింద్రాబాద్ జోన్ డిసిపి రక్షిత కృష్ణమూర్తి

కార్యక్రమంలో పాల్గొన్న సికింద్రాబాద్ జోన్ డీసీపీ రక్షిత కృష్ణమూర్తి ఇతర అధికారులు

సికింద్రాబాద్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త: వీడియో గెమ్‌ల ద్వారా కూడా సైబర్ క్రైంలు పెరిగిపోయాని, పిల్లలు ఇష్టానుసారంగా గేమ్‌లు ఆడుతూ బలవుతున్నారని సికింద్రాబాద్ జోన్ డీసీపీ రక్షిత కృష్ణమూర్తి తెలిపారు. వారసిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని జామియా ఉస్మానియా వద్దగల ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో భారీ సైబర్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆమే మాట్లాడుతూ మొబైల్ ఫోన్స్‌లో క్యాండీ క్రష్ వంటి ఆటలు ఆడుతుండగా, ఒక లెవల్ నుండి మరో లెవల్‌కి వెళ్ళినప్పుడు ఫ్రీ గిఫ్ట్ ఆఫర్‌లు వస్తుంటాయని, ఆ లింకులను నొక్కినప్పుడు అవి మనల్ని ప్రమాదకరమైన పేజీలకు తీసుకెళ్లి, అనధికారిక యాప్‌లను డౌన్‌లోడ్ చేసేలా ప్రోత్సహిస్తాయి" అని ఆమె హెచ్చరించారు. ఇలాంటి వాటిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చిలకలగూడ ఏసీపీ కె. శశాంక్ రెడ్డి, వారాసిగూడ ఇన్‌స్పెక్టర్ రవీందర్ గౌడ్, సెక్టర్ ఎస్సై రామచంద్రారెడ్డి, సికింద్రాబాద్ జోన్ మహిళా ఎస్సై మేఘన ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కోకరివాడి,షక్కర్‌కోటలో అధ్వానంగా రోడ్లు

కోకరి వాడిలో చెడి పోయిన రోడ్డు

చార్మినార్,ఫిబ్రవరి 21 ప్రభాతవార్త : పాతబస్తీ ఘాన్సీ బజార్ డివిజన్ పరిధిలోని కోకరివాడి,షక్కర్‌కోట ప్రాంతాలలో రహదారులు చెడి పోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు.చెడి పోయిన రోడ్లకు మరమ్మతులు చేపట్టనందున ప్రజలు నరక యాతనకు గురివుతున్నారు. వస్త్రాలు, బంగారం ఆభరణాల విక్రయాలకు ప్రసిద్ధి గాంచిన కోకరివాడి,షక్కర్‌కోటకు ప్రతీ రోజు ప్రజలు వస్తుంటారు.అసలే ఇక్కడ రహదారులు వెడల్పు దీనికి తోడు రోడ్లు గుంతలు మయంగా మారటంతో స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు.కోకరివాడి,షక్కర్‌కోట ప్రాంతాలకు చెందిన వ్యాపారులు అన్ని రకాల పన్నులు సకాలంలో చెల్లిస్తున్న జిహెచ్ఎంసి అధికారులు మాత్రం రహదారులకు మరమ్మతులు చేపట్టక పోవటం పట్ల స్థానికులు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు.బండిఅడ్డ నుంచి షక్కర్‌కోట,కోకరవాడి ప్రాంతాలకు రాత్రి వేళల్లో ప్రజలు ప్రయాణం చేయాలంటేనే వెనుకంజు వేస్తున్నారు.రహదారిలో రాళ్లు తేలి ఉన్నందున వాహనదారులు అదుపు తప్పి వాహనాలను అదుపు చేయలేక కింద పడిపోతున్నారు.సంవత్సరం నుంచి కోకరివాడి,షక్కర్‌కోట ప్రాంతాలలో చెడిపోయిన రోడ్లకు మరమ్మతులు చేయాలని అధికారులకు ప్రజలు మొరపెట్టుకున్న పట్టించుకునే నాధుడే కరువయ్యాడు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఘాన్సీ బజార్‌లోని కోకరివాడి, షక్కర్‌కోటలోని రహదారులకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అపార్ట్‌మెంట్ చోరీ కేసును ఛేదించిన బేగంపేట పోలీసులు

-ఇద్దరు నిందితుల అరెస్ట్...రూ40లక్షల విలువైన బంగారం,60వేల నగదు,మొబైల్‌ఫోన్లు స్వాధీనం

సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ గోపాలకృష్ణమూర్తి

స్వాధీనం చేసుకున్న నగలు,నగదు

బేగంపేట ఫిబ్రవరి 21,ప్రభాతవార్త బేగంపేట పోలీసుస్టేషన్ పరిధిలోని శ్యాంలాల్ బిల్డింగ్‌లోని సత్యకృష్ణ సిరి సంపద అపార్ట్‌మెంట్ 302 ఫ్లాట్ లో జరిగిన చోరీ కేసును బేగంపేట పోలీసులు ఛేదించారు.ఈ కేసులో నిందితులైన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి నగదు,235 గ్రాముల బంగారు ఆభరణాలు, రెండు మొబైల్ ఫోన్లు,రూ 65వేల నగదును స్వాధీనం చేసుకున్నారు.ఈ ఘటనపై శనివారం బేగంపేట పోలీసుస్టేషన్ లో ఏసీపీ గోపాల కృష్ణమూర్తి విలేఖరుల సమావేశం నిర్వహించి వివరాలు తెలియజేసారు.బేగంపేట శ్యాంలాల్ బిల్డింగ్ సత్యకృష్ణ సిరి సంపద అపార్ట్‌మెంట్ 302 ఫ్లాట్ లో ఎం.అనురాధ విజేంద్రనాథ్ అనే మహిళ ఒంటరిగా నివసిస్తుందన్నారు.ఈ నెల 15వ తేదీ మధ్యాహ్నం ఆమె కవాడీ గూడా లో నివసిస్తున్న తన కుమార్తె వద్దకు వెళ్లిందన్నారు.16ఉదయం ఆమె ఇంట్లో పనిచేసేందుకు వచ్చిన పనిమనిషి ఇంట్లో తాళాలు పగుల గొట్టి ఉండటం చూసి అనురాధకు సమాచారం ఇచ్చిందన్నారు.వెంటనే ఆమె ఇంటికి వచ్చి చూడగా ఇంట్లోని సుమారు 40తులాల బంగారు ఆభరణాలు,వెండి,రూ 60వేల రూపాయల నగదు దొంగిలించినట్లు పోలీసులకు ఫిర్యాదు చేసిందన్నారు.ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న బేగంపేట పోలీసులు దర్యాప్తు ప్రారంభించారన్నారు.21వ తేదీన ఇద్దరు నిందితులు సికింద్రాబాద్ రేతిఫిల్ బస్టాండ్ ప్రాంతంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న బేగంపేట ప్రకాష్ నగర్‌లో శివపార్వతి బాయ్స్ హాస్టల్‌లో నివాసం ఉంటున్న శ్రీకాకుళం జిల్లా వరక కవిటి బోరివంక కు చెందిన బి.ప్రదీప్ (25) ,షేక్ పేట కు చెందిన ఎడ్ల ప్రవీణ్ కుమార్(32), అనుమానంతో అదుపులోకి తీసుకుని విచారించగా నేరం చేసిన విషయాన్ని వెల్లడించారన్నారు.వారి వద్ద నుంచి 235గ్రాముల బంగారు ఆభరణాలు ,రెండు మొబైల్స్,రూ65000లు నగదు మొత్తం రూ40,00,000లు స్వాధీనం చేసుకున్నామని ఏసీపీ వెల్లడించారు.నిందితులు సీసీ కెమెరాలు లేని అపార్ట్‌మెంట్ ను గుర్తించి ఈ దొంగ తనానికి పాల్పడ్డారన్నారు.వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.ఈ సందర్భంగా ఏసీపీ గోపాల కృష్ణమూర్తి మాట్లాడుతూ బేగంపేట పరిధిలో నివసించే ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడంతో పాటు,మెయిన్ డోర్ కు సెంట్రల్ లాకింగ్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.ప్రయాణాల వివరాలను సోషల్ మీడియాలో ఎప్పుడూ పోస్ట్ చేయవద్దని హెచ్చరించారు. నేర స్థలను పట్టుకోవడంలో చాక చక్యంగా వ్యవహరించిన బేగంపేట ఇన్స్‌పెక్టర్ సైదులు, కంటోన్మెంట్ టీం ఇన్స్‌పెక్టర్ నరసింహరావు, కె.సుచ్చ దానందం,ఎస్సై శ్రావణ్ కుమార్,బేగంపేట క్రైం సిబ్బంది ని ఏసీపీ అభినందించారు.ఈ సమావేశంలో బేగంపేట ఏసీపీ గోపాల కృష్ణమూర్తి తో పాటు ఇన్స్‌పెక్టర్ సైదులు ఎస్సై శ్రావణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వార్డుసభ్యులకు ధృవపత్రాల అందజేత

వార్డుసభ్యులకు ధృవపత్రాలు అందచేస్తున్న ఎంపిడిఓ శంకర్

చౌటకూరు, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:
మండలపరిధిలోని 15 గ్రామపంచాయతీలకు ఎన్నికైన 134మంది వార్డు సభ్యులకుగాను మొదటివిడతలో భాగంగా 66మంది వార్డుసభ్యులకు నిర్వహించిన శిక్షణతరగతులు శనివారంతో ముగిసాయి. మొదటివిడతలో భాగంగా ఈ నెల 17న ప్రారంభమైన శిక్షణ తరగతులకు హాజరైన వార్డు సభ్యులకు విధినిర్వహణలో పాటించాల్సిన పద్ధతులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై, గ్రామ పంచాయతీకి అప్పగించిన అన్నివిధులను సక్రమంగా సమర్థవంతంగా నిర్వహించేలా ఎంపిడిఓ శంకర్ ఆధ్వర్యంలో శిక్షకులు శిక్షణ ఇచ్చిన విషయం పాఠకులకు విదితమే. శిక్షణ పూర్తి చేసుకున్న 66 మంది వార్డుసభ్యులకు ఎంపిడిఓ శంకర్ ధృవపత్రాలు అందచేశారు. కార్యక్రమంలో ఎంపిఓ సువర్ణ, పంచాయతీ కార్యదర్శులు, వార్డుసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

23 నుంచి రెండవ విడత శిక్షణ...
ఈ నెల 23వ తారీఖు నుంచి మండల కేంద్రమైన చౌటకూరులోని రైతు వేదికలో 15 గ్రామ పంచాయతీల్లోని 66మంది వార్డుసభ్యులకు రెండవ విడత శిక్షణ నిర్వహించనున్నట్లు ఎంపిడిఓ శంకర్ పేర్కొన్నారు.

మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేయాలి

-బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మున్సిపల్ మేనేజర్‌కు వినతి

మున్సిపల్ మేనేజరుకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

హుస్నాబాద్ రూరల్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త
హుస్నాబాద్ పట్టణంలోని నేషనల్ హైవే రోడ్డుపై ఉన్న డివైడర్‌లపై మహనీయుల విగ్రహాలు ఏర్పాటుచేయాలని కోరుతూ బిఆర్ఎస్‌పార్టీపక్షాన శనివారం మున్సిపల్ మేనేజర్ సంపత్‌రావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జునరెడ్డి, సీనియర్ నాయకులు బుర్ర శ్రీనివాస్‌గౌడ్, పట్టణ యూత్ అధ్యక్షులు మేకల వికాస్‌యాదవ్, గోపాగోని నాయకులు అరవింద్‌గౌడ్, శివరామ్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ కబడ్డీ సీనియర్ జట్టుకు వంశీకృష్ణ ఎంపిక

అక్కన్నపేట, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:
అక్కన్నపేటమండలంలోని చౌటపల్లిగ్రామానికి చెందిన కబడ్డీ క్రీడాకారుడు పులికాశి వంశీకృష్ణ శనివారం తెలంగాణ కబడ్డీ సీనియర్ జట్టుకు ఎంపిక కావడం పట్ల గ్రామప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు. తెలంగాణ తరపున ప్రాతినిధ్యం వహిస్తూ, ఆయన త్వరలో గుజరాత్ రాష్ట్రంలో జరగనున్న జాతీయస్థాయి కబడ్డీ టోర్నమెంట్‌లో పాల్గొననున్నారు. గ్రామీణస్థాయి నుంచి జాతీయవేదిక వరకు ఎదిగిన వంశీకృష్ణ ప్రతిభ చౌటపల్లి గ్రామానికి గర్వకారణంగా నిలుస్తోంది. చౌటపల్లిగ్రామం నుంచి క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో పోటీపడటం యువతకు స్ఫూర్తినిచ్చే అంశమని ఆగ్రామ మాజీసర్పంచి గద్దల రమేష్‌తోపాటు గ్రామపెద్దలు పేర్కొంటున్నారు. వంశీకృష్ణ మరింత ఉన్నత విజయాలు సాధించి రాష్ట్రానికి, గ్రామానికి మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తూ గ్రామస్థులు, క్రీడాభిమానులు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

బకాయిలు చెల్లించకుంటే నిరాహారదీక్షకు దిగుతాం

విలేకరులతో మాట్లాడుతున్న దృశ్యం

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:
2024 మార్చినుంచి ఉద్యోగవిరమణ పొందిన రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లకు రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని పదవీవిరమణ పొందిన ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పొన్నమల్ల రాములు, ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డిలు ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 23నెలలు గడిచినా బకాయిలు రాకపోవడంతో తీవ్ర మానసిక ఒత్తిడి గురై ఇప్పటివరకు 68మంది ప్రాణాలు వదిలారన్నారు. కొంతమంది ఉన్నత న్యాయస్థానానికి వెళ్లి ఉత్తర్వులు తెచ్చుకున్నా, కోర్టు ఉత్తర్వులు ప్రభుత్వం పట్టించుకోకుండా బకాయిలు విడుదల చేయకపోవడం సరికాదన్నారు. ప్రభుత్వం మార్చి 1లోపు బకాయిలు చెల్లించకుంటే 2నుంచి ఇందిరాపార్క్‌వద్ద కుటుంబసభ్యులతోకలిసి నిరాహారదీక్షకు దిగుతామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు రాజిరెడ్డి, శంకర్‌రావు, భగవాన్‌రెడ్డి, ఎండికుదరథ్ అలీ, సురేందర్‌గౌడ్‌లు పాల్గొన్నారు.

పిహెచ్‌సికి దేవుళ్ళ ఫోటో అందజేత



పిహెచ్‌సికి దేవుళ్ళ ఫోటోను అందిస్తున్న దృశ్యం

కొండపాక, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:
కుకునూరుపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి దేవుళ్ల ఫోటోను అందించారు వాసవిక్లబ్ సభ్యులు. ఈసందర్భంగా వాసవి క్లబ్ సభ్యులు ఉప్పల రాజు, ఉప్పల పాండురంగం, వార్డుసభ్యులు గడం నరేష్, సంతోష్ మాట్లాడుతూ గత 25సంవత్సరాలుగా కలియుగదైవంగా భావించే శ్రీవేంకటేశ్వర స్వామి ఫోటో పిహెచ్‌సిలో డాక్టర్‌గదిలో ఉండేదన్నారు. ప్రస్తుతం ఆ ఫోటోను తీసివేసినట్లు తెలియడంతో ఫోటో ఎందుకు తీసేసారంటు వైద్యురాలు పర్వీన్‌ను వాసవిక్లబ్ సభ్యులు నిలదీశారు. అదేవిధంగా తెలంగాణ వ్యూహకర్త ప్రొఫెసర్ జయశంకర్ ఫోటోను సైతం డాక్టర్‌గదిలో నుండి తీసివేయడంతో ఆగ్రహం వ్యక్తంచేశారు. అనంతరం వారు తొలగించిన దేవునిఫోటో ఉన్న ప్రదేశంలో తిరిగి మరో దేవుళ్ళ ఫోటోను అందించారు.

మధ్యాహ్నభోజనాన్ని పరిశీలించిన సర్పంచి

చిలిపిచెడ్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:
మండలకేంద్రమైన జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో అక్షయపాత్ర ద్వారా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్నభోజనాన్ని సర్పంచి జూలా అనీల్ కుమార్ శనివారం పరిశీలించారు. నాణ్యమైనభోజనం అందుతుందా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఆయనవెంట హెచ్ఎం ధనరావు, గ్రామస్థులు సుధాకర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం

-జిల్లా విద్యాధికారి ఎలంకీ శ్రీనివాస్‌రెడ్డి

రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

చిన్నకోడూరు, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:
క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడతాయని జిల్లావిద్యాధికారి ఎలంకీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలపరిధిలోని చంద్లాపూర్ సమీపం లోగల రంగనాయకసాగర్ ప్రాజెక్టుకట్టపై శనివారం సిఎంకప్ రాష్ట్రస్థాయి సైక్లింగ్‌పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువు ఎంత ముఖ్యమో క్రీడలు కూడా అంతే ముఖ్యమన్నారు. రాష్ట్రప్రభుత్వం సిఎంకప్ పేరిట గ్రామీణ ప్రాంతాలలో ఉన్న క్రీడాకారులను గుర్తించడానికి ప్రతిభగల క్రీడాకారులకు ప్రోత్సాహకాలు అందజేస్తున్నట్లు తెలిపారు. పల్లెల నుంచి ప్రపంచస్థాయి వరకు ఆడాలనే నినాదంమేరకు ఈ పోటీలను గ్రామస్థాయి నుంచి నిర్వహించి ప్రతిభావంతులను పంపుతామన్నారు. విద్యార్థులు, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఒలంపిక్ స్థాయిలో ఎదగాలన్నారు. రాష్ట్రస్థాయి సైకిల్‌పోటీలకు రాష్ట్రంలోని 33జిల్లాలనుంచి 400 మంది విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు. క్రీడాకారులకు క్రీడాదుస్తులు పంపిణీచేశారు. క్రీడలు రెండురోజులపాటు నిర్వహించడం జరుగుతుందన్నారు. సిద్దిపేట రూరల్ సిఐ శ్రీను, ఎస్ఐ చంద్రమోహన్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచి సూరగోని శేఖర్‌గౌడ్, జిల్లా యువజన క్రీడా అధికారి జంగాపల్లి వెంకటనర్సయ్య, సైకిల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బండారుపల్లి శ్రీనివాస్, కోశాధికారి చింతకింది శ్రీనివాస్, జిల్లా స్కూల్ గేమ్ ఫెడరేషన్ కార్యదర్శి సౌందర్య, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఇరిగేషన్ మంగారెడ్డి, రామేశ్వర్‌రెడ్డి, మాలతి, ఉప్పలయ్య, సువర్ణలత, సైక్లింగ్ టెక్నికల్‌టీంసభ్యులు దత్తాత్రేయ, విజయ్‌కాంతరావు, విజయభాస్కర్, అల్లాడి కృష్ణ, ధర్మతేజ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు రాక తాండవాసుల తహతహ

-పట్టించుకోని అధికారులు-పరేషాన్‌లో తాండవాసులు

అల్లాదుర్గం, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:
మండలపరిధిలోని ముప్పారంతాండాకు గత వారంరోజుల నుంచి మిషన్ భగీరత నీరు సరఫరాకాక తాండవాసులు పరేషాన్ అవుతున్నారు. వారం రోజులుగా తాండాకు తాగునీరు సరఫరాకాకున్నా, పట్టించుకునే అధికారులు, పాలకులు కరువవడంతో తాండవాసులు అందోళన చెందుతున్నారు. మిషన్ భగీరథ అధికారుల పనితీరుపై ప్రజలు మండిపడుతున్నారు. అధికారుల దృష్టికి సమస్యను పలుమార్లు తీసుకుపోయినా, తమకేం పట్టనట్లుగా వ్యవహరించడం సరికాదని తాండవాసులు హెచ్చరిస్తున్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుని తాండకు మిషన్‌భగీరథ నీరు సరఫరా అయ్యేలా అధికారులు చూడాలని తాండా వాసులు వినతిచేస్తున్నారు.

నీరురాక వృథాగా ఉన్న పైపు

త్వరలోనే సిద్దిపేట తంజీమ్ సమస్య పరిష్కారం

విలేకరులతో మాట్లాడుతున్న దృశ్యం

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:
గత రెండుయేళ్లుగా సిద్దిపేట తంజీమ్ ఉల్-మసాజిద్‌లో నెలకొన్న సమస్యలపై త్వరలోనే చట్టానికి లోబడి పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తంజీమ్ ఉల్-మసాజిద్ కమిటీ సుప్రీం బాడీ అధ్యక్షులు జుబెర్ హుస్సేన్, తంజీమ్ ఉల్-మసాజిద్ కమిటీ ప్రెసిడెంట్ జియావుద్దీన్ అసిఫ్ తెలిపారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. సిద్దిపేట తంజీమ్-ఉల్-మసాజిద్ సొసైటీ పాత రిజిస్ట్రేషన్ నంబరు 414/2010 పూర్తిగా రద్దుచేయడం జరిగిందన్నారు. 284/2023లో చేసిన సొసైటీ రిజిస్ట్రేషన్ ఆధికారికంగా అమలులో ఉందన్నారు. సిద్దిపేట కమిటీలో ఉన్న సుప్రీం బాడీ మెంబర్స్ అందరూ తంజీమ్‌లో కార్యకలాపాలు కొనసాగిస్తున్నారని తెలిపారు. సిద్దిపేట తంజీమ్‌కు చెందిన షాపింగ్ కాంప్లెక్స్‌ల్లో కిరాయిదారులు తమ నెలవారీ కిరాయిని సిద్దిపేట తంజీమ్‌లో డిపాజిట్ చేయాలన్నారు. ఆధికారిక తంజీమ్ నుంచి బాధ్యతగల వ్యక్తులకు మాత్రమే కిరాయి చెల్లించాలన్నారు. సిద్దిపేట తంజీమ్‌లో ఎలాంటిసమస్యలు లేవని పారదర్శకపాలనే ధ్యేయంగా ముందుకుసాగడం జరుగుతుందన్నారు. సిద్దిపేట ముస్లిం సమాజ శ్రేయస్సుకు తంజీమ్ నూతన ఒరవడికి నాంది పలుకనుందన్నారు. సమావేశంలో సుప్రీం బాడీ సభ్యులు, తంజీమ్ ఉల్-మసాజిద్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి

హత్నూర, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:
హత్నూర మండలం తురకల ఖానాపూర్ గ్రామంలో జరిగిన శ్రీఎల్లమ్మతల్లి జాతర మహోత్సవంలో శనివారం స్థానిక ఎమ్మెల్యే వాకిటి సునీతాలక్ష్మారెడ్డి పాల్గొన్నారు. బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. కార్యక్రమం నిర్వాహకులు ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డికి ఘనంగా స్వాగతం పలికారు. ఆమెవెంట మండల టిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

జైల్లో బిఆర్ఎస్ శ్రేణులను పరామర్శించిన మాజీ మంత్రి

-కాంగ్రెస్ అక్రమాలు ఇంకెన్నాళ్లని ప్రశ్నించిన హరీష్‌రావు

కంది, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:
జిల్లాలో బిఆర్ఎస్ శ్రేణులపై కాంగ్రెస్ అక్రమంగా కేసులు పెట్టి జైల్లో పెట్టడం తగదని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు ఆందోళన వ్యక్తంచేశారు. అక్రమంగా కేసులుపెట్టిన 13మంది బిఆర్ఎస్ శ్రేణులను కంది లోని జిల్లా జైలులో ఉన్న హరీష్‌రావు శనివారం కలుకుని వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, ధైర్యంగా ఉండాలని, పార్టీ అండగా ఉంటుందని ధైరంచెప్పారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా అడ్డదారిలో అధికారం దక్కించుకునేందుకు కాంగ్రెస్ కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. మెదక్‌లో కాంగ్రెస్ కంటే బిఆర్ఎస్‌కు ఒక వార్డులో అధికంగా విజయం సాధించిందని గుర్తుచేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా ఒక వార్డుకు నాలుగు కార్లకాన్వాయ్‌తో ఎమ్మెల్యే ఎందుకు వచ్చారని, ముస్లిం మహిళలపై దాడి జరిగితే స్పందించినవారిపై కేసులుపెట్టడం ఇదెక్కడి న్యాయం అని ప్రశ్నించారు. పోలీసులు ఉండగానే అర్ధరాత్రి డబ్బులు పంపిణీ చేశారని ఆరోపిస్తూ కేసులు పెట్టాల్సింది కాంగ్రెస్ నేతలపై, ఎమ్మెల్యేలపై అని సూచించారు. ఎస్సీ నాయకులపై ఎస్సీ,ఎస్టీ కేసులు నమోదు చేయడం దురుద్దేశపూరిత చర్యగా అభివర్ణించారు. పోలీసులు తమ ఇష్టారాజ్యంగా కేసులు నమోదు చేస్తే రేపు సమాధానాలు చెప్పాల్సి ఉంటుందని హెచ్చరించారు. జిల్లా ఎస్పీతో మాట్లాడిన ఆధారాలు ఉన్నా కేసులు నమోదు చేయడం లేదని, ఈ విషయమై డిజిపి సమాధానం చెప్పాలని డిమాండ్‌చేశారు. ప్రతి విషయాన్ని డైరీలో నమోదు చేస్తున్నామని, పోలీసుల వ్యవహారంపై శాసనసభలో చర్చిస్తాం అని హరీష్‌రావు స్పష్టంచేశారు.

అంబేద్కర్ జెండాను తగలబెట్టిన వారిని వెంటనే అరెస్టు చేయాలి

-ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు మైసగళ్ల బుచ్చేంద్రమాదిగ

మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

హత్నూర, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:
హత్నూర మండలం నాగుల దేవులపల్లి గ్రామంలో ఉన్నటువంటి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జెండా ఉన్న కట్టెను పెట్రోల్‌పోసి తగులబెట్టిన వ్యక్తులను గుర్తించి కఠినచర్యలు తీసుకోవాలని ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు మైసగళ్ల బుచ్చేంద్రమాదిగ డిమాండ్‌చేశారు. శనివారం ఆయన ఘటన జరిగిన స్థలాన్ని సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో కూడా ఇలాంటి సంఘటన జరిగిందని, మళ్లీ జరగడంతో ఇలాంటి సంఘటన పునరావృతం కాకుండా దుండగులను వెంటనే అరెస్టుచేయాలని, వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదుచేసి వెంటనే శిక్షించేవిధంగా చర్యలు తీసుకోవాల్సిందిగా డిమాండ్‌చేశారు. గంధగల్ల ప్రసాద్‌మాదిగ, ఎమ్మెస్‌పి జిల్లా కార్యదర్శి, గంధగల్ల వీరయ్యమాదిగ, ఎంఎస్పీ జిల్లా గౌరవ అధ్యక్షులు నల్లోల్ల ప్రవీణ్ కుమార్‌మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధికారప్రతినిధి, నల్లోల్ల మొగులయ్యమాదిగ, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సీనియర్ నాయకులు, మాజీ సర్పంచి సుధాకర్, ప్రస్తుత సర్పంచి, గ్రామంలోని యువకులు పాల్గొన్నారు.

సిసిరోడ్డు పనులను పర్యవేక్షించిన యువనేత

నారాయణఖేడ్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:
నారాయణఖేడ్ మున్సిపల్ పరిధిలోని 15వ వార్డులో జరుగుతున్న సిసి రోడ్డు నిర్మాణ పనులను యువనేత సాగర్ శెట్కార్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు పనుల నాణ్యతను పరిశీలించి, అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ నాయకులు బిసిసెల్ అధ్యక్షులు సాయిలుపటేల్, మండల్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు తాహిర్ అలీ, మాజీ ఎంపిటిసి ముంతాజ్, 15వ వార్డ్ కాంగ్రెస్ అభ్యర్థి అసిఫ్ పాల్గొన్నారు.

గృహప్రవేశానికి హాజరైన సాగర్ శెట్కార్...

నారాయణఖేడ్ మున్సిపల్‌కు చెందిన వాసరి వరలక్ష్మి కీర్తిశేషులు శ్రీనివాస్ నూతన గృహప్రవేశం కార్యక్రమంలో యువనేత సాగర్ శెట్కార్ పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. వారితో నారాయణఖేడ్ నియోజకవర్గం బిసిసెల్ అధ్యక్షులు సాయిలు పటేల్, నారాయణఖేడ్ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు శివకుమార్, మహేష్, మీట్టు రమేష్ గుత్తి తదితరులు ఉన్నారు.

హుస్నాబాద్‌లో సిగరెట్‌లపై దోపిడీ రాజ్యం

-కిరాణా నుంచి చాయ్, పాన్ షాపుల వరకూ ఎంఆర్‌పికి బహిరంగ తూట్లు...!

హుస్నాబాద్‌లో అధికధరలకు సిగరెట్లు విక్రయిస్తున్న గ్రావిటీ టీ-పాయింట్

హుస్నాబాద్ రూరల్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:
హుస్నాబాద్ పట్టణం మొత్తం మీద కిరాణా షాపులు, చాయ్ దుకాణాలు, పాన్ షాపులు అన్నీ ఒక్కటే దారిలో నడుస్తూ సిగరెట్లను యథేచ్ఛగా అధికధరలకు విక్రయిస్తున్నాయి. నిబంధనల ప్రకారం ఎంఆర్‌పికి మించి అమ్మకాలు నేరమైనా, ఇక్కడ మాత్రం అన్ని రకాల సిగరెట్లపై ఒక్కొక్కటికి రూ.5 వరకు అదనంగా దోచుకుంటున్నారు.

ఇది ధరల పెంపు కాదు.. పగటి వెలుగులోనే జేబులు ఖాళీచేసే దందా అని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. సిగరెట్ డిస్ట్రిబ్యూటర్లు పాతస్టాక్‌కే కొత్తరేట్లు అంటగట్టి తమకు అమ్ముతున్నామని వ్యాపారులే బహిరంగంగా చెప్పడం చూస్తే, అధికార యంత్రాంగం ఎంత నిర్వీర్యంగా ఉందో స్పష్టంగా అర్థమౌతుంది. ప్రత్యేకంగా హుస్నాబాద్ పట్టణంలోని గ్రావిటీ టీ-పాయింట్‌తోపాటు పట్టణంలో అక్కడక్కడా చాయ్ అడ్డాలుగా ఏర్పాటు చేసిన షాపుల పరిసరాల్లో ఈ అక్రమవసూళ్లు పరాకాష్ఠకు చేరాయి. ఎంఆర్‌పికి మించి విక్రయాలు నేరమని చట్టం చెబుతున్నా, సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో హుస్నాబాద్‌లో సిగరెట్ వ్యాపారం మాఫియా తరహా దోపిడీగా మారిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వినియోగదారుల హక్కు చట్టం ప్రకారం ఎంఆర్‌పి బోర్డులు ఏర్పాటుచేయాల్సిన వ్యాపారులు ఎక్కడా కూడా బోర్డులు ఏర్పాటు చేయకుండా నిబంధనలు తుంగలో తొక్కుతున్నారు. ఇదేంటని ప్రశ్నించే వారిపై నిర్వాహకులు బెదిరింపులకు దిగుతూ దురుసు సమాధానాలు చెప్తున్నారని పెద్ద ఎత్తున ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు పట్టణవ్యాప్తంగా ఆకస్మికతనిఖీలు చేసి, కిరాణా, చాయ్, పాన్ షాపుల్లో అధికధరలకు సిగరెట్లు విక్రయిస్తున్న వారిపై కఠినచర్యలు తీసుకోకపోతే ప్రజాగ్రహం ఉధృతమవుతుందన్న హెచ్చరికలు పట్టణం అంతటా వినిపిస్తున్నాయి.

విద్యార్థులందరూ మంచిఫలితాలు సాధించాలి

-జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రవీందర్‌రెడ్డి

కోహెడ, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:
విద్యార్థులందరూ ఇష్టంగా చదివి మంచి ఫలితాలు సాధించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కలకొండ రవీందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన వార్షికోత్సవం, విద్యార్థులకు వీడ్కోలు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జీవితంలో ఉన్నతలక్ష్యాలను సాధించి తల్లిదండ్రులు మీపై పెట్టుకున్న ఆశలు నెరవేర్చాలన్నారు. సర్పంచి బందేల సునీతాకిషన్ మాట్లాడుతూ ఇంటర్మీడియట్‌దశ ఎంతోకీలకమైందని మీలక్ష్యాలు సాధించడం ఈదశ నుంచే ప్రారంభించాలన్నారు. కళాశాలలో నిర్వహించిన ఆటల పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ కోతి యాదగిరి, ఆధ్యాపకులు రాజమౌళి, రాజేశ్వర్‌రెడ్డి, వెంకటరెడ్డి, నీరజ, రజిత, నరేష్, సీతారామయ్య, శ్రీనివాస్, సుజాత, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామసభలో పిహెచ్‌సి వైద్యురాలిపై ప్రజల ఆగ్రహం



కుకునూరుపల్లిలో గ్రామసభ నిర్వహిస్తున్న దృశ్యం

కొండపాక, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:
కుకునూరుపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో పనిచేస్తున్న డాక్టర్ పర్వీన్ ప్రజలకు సరిగా వైద్యం అందించకుండా ప్రతి చిన్న విషయానికి గజ్వేల్ ఆసుపత్రికి పంపుతున్నారని కుకునూరుపల్లి గ్రామప్రజలు ఆమెను నిలదీశారు. శనివారం సర్పంచి మల్లం కనకవ్య ఐలయ్య ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ గ్రామసభకు అన్నిశాఖల అధికారులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని కార్యదర్శి స్వప్నకు సూచించారు. గతంలో రెండుసార్లు జాతీయస్థాయి అవార్డులు అందుకొని జిల్లాలో ఉత్తమ పిహెచ్‌సిగా పేరు తెచ్చుకున్న పిహెచ్‌సి ప్రస్తుతం, పిహెచ్‌సిలో పనిచేస్తున్న వైద్యురాలు వచ్చినప్పటి నుండి డెలివరీలు చేయకుండా ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆమెను నిలదీశారు. కార్యక్రమంలో వార్డుసభ్యులు, ఉప్పల పాండురంగం, ఉప్పల రాజు, సంతోష్, బక్కని యాదయ్య, శ్రీధర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

సంత్ సేవాలాల్‌మహారాజ్ బోధనలు స్ఫూర్తిదాయకం

-పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:
పటాన్‌చెరు నియోజకవర్గపరిధిలోని గిరిపుత్రులు, గిరిజనుల సంక్షేమానికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉన్నామని బంజారాల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్‌మహారాజ్ జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయమని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మండలం భానూరుపరిధిలోని బిడిఎల్‌లో సంత్ సేవాలాల్‌మహారాజ్ దేవాలయం నిర్మాణానికి పదిహేనులక్షల రూపాయల సొంతనిధులు అందించనున్నట్లు ఆయన ప్రకటించారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని జిఎంఆర్ ఫంక్షన్‌హాల్‌లో శనివారం సంత్ సేవాలాల్‌మహారాజ్ 287వ జయంతి ఉత్సవాలను ఆధికారికంగా ఎమ్మెల్యే జిఎంఆర్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. పటాన్‌చెరు డివిజన్‌పరిధిలోని మైత్రి మైదానం నుండి జిఎంఆర్ ఫంక్షన్‌హాల్ వరకు భారీర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే జిఎంఆర్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా సేవాలాల్‌మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం భోగ్‌బండార్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా పాఠశాలల విద్యార్థులను నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. అనంతరం ఉత్సవ సమితి ప్రతినిధులు ఎమ్మెల్యే జిఎంఆర్‌ను ముత్తమ్మ సంప్రదాయ పద్ధతిలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, వివిధశాఖల అధికారులు, బంజారా సంక్షేమసంఘం, బంజారా ఉద్యోగసంఘం ప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

నాగుల్‌దేవులపల్లి గ్రామాన్ని సందర్శించిన సిఐ

గ్రామస్థులతో మాట్లాడుతున్న జిన్నారం సిఐ రమణారెడ్డి

హత్నూర, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:
హత్నూర మండలం నాగుల్దేవ్‌పల్లి గ్రామాన్ని శనివారం జిన్నారం సిఐ రమణారెడ్డి, హత్నూర ఎస్సై శ్రీధర్‌రెడ్డిలు సందర్శించారు. గ్రామంలో ఏర్పాటుచేసిన అ